ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

5

తిరుపతి

జిల్లా వార్తలు

బుధవారం 12 మార్చి 2025





తుడాలో కొలిక్కి వచ్చిన విజిలెన్సు విచారణ

ఈ నెలాఖరుకు ప్రభుత్వానికి నివేదిక

తిరుపతి(నేరవిభాగం), మార్చి 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా)లో అవినీతి అక్రమాలపై సాగుతున్న విజిలెన్సు విచారణ ఒక కొలిక్కి వచ్చింది. ఈ నెలాఖరులోగా విచారణను ముగించి.. ప్రభుత్వానికి నివేదిక అందించే పనిలో అధికారులు ఉన్నట్లు తెలిసింది. గత పాలకుల హయాంలో తుడాలో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయంటూ రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. ప్రధానంగా 16 నుంచి 18 అంశాలకు సంబంధించి నిధులు దుర్వినియోగమైనట్లు ఫిర్యాదుల్లో పేర్కొనడంతో.. ప్రభుత్వం విజిలెన్సు విచారణకు ఆదేశించింది. ఐదు నెలలుగా విచారణ జరుపుతున్న అధికారులు.. ఎక్కడెక్కడ పనులు జరిగాయి? ఎంతమేరకు నిధులు పక్కదారి పట్టాయనే దానిపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. వైసీపీ హయాంలో తుడా పరిధిలో జరిగిన పనుల వివరాలు అధికారులు తెప్పించుకుని పరిశీలించారు. వాటి ఆధారంగా క్షేత్ర స్థాయిలో విచారిస్తున్నారు. చంద్రగిరి నియోజకవర్గంతో పాటు తిరుపతి అర్బన్ పరిధిలోనూ లెక్కకు మించి అంచనాలతో బెంచ్‌లు ఏర్పాటు చేశారు. వీటిని అంచనాల కంటే ఎక్కువగా ధరలు కోట్ చేసినట్లు విజిలెన్సు విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. ఇక కుండీలు ఏర్పాటు చేసి మొక్కలు నాటడంలో నిధుల దుర్వినియోగమైనట్లు విచారణ అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఇక, ఎన్నికల ముందు తుడా నిధులను కొన్ని ప్రాంతాల ఎంపీడీవోలకు కేటాయించడంపైనా దర్యాప్తు సాగుతోంది. ఇందులో వివిధ అభివృద్ధి పనుల పేరిట పాత పనులు కొత్తగా చేసినట్లు చూపించి నిధులు స్వాహా చేశారనే ఆరోపణలున్నాయి. ఇదిలా వుండగా 2020-21వ సంవత్సరంలో దాదాపు 55 పనులకు సంబంధించి రూ23 కోట్లతో టెండర్లు పిలిచినట్లు సమాచారం. 2021-22లో 407 పనులకు సంబంధించి 145 కోట్లు, 2022-23లో రూ.470 కోట్లకు సంబంధించి 157 పనులకు టెండర్లు పిలిచారు. మరికొన్ని పనులను నామినేషన్ ప్రాతిపదికన కేటాయించారు. వీటిలోనూ అక్రమాలు జరిగినట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లిన క్రమంలో... ఈ కోణంలోనూ విజిలెన్సు విచారణ సాగుతోంది. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు రూ.200 కోట్లకుపైగా తుడా నిధులు పక్కదారి పట్టినట్లు విచారణలో తేలిందని సమాచారం. గత ఐదేళ్ల కాలంలో జరిగిన పనులు, నిధుల వినియోగంపై విచారణకు సంబంధించి నివేదికను ఈ నెలాఖరులోగా ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిసింది.

నేటి నుంచి విరించి-2కె25

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 11(ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో బుధవారం నుంచి విరించి-2కె25 కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు ఇంజనీరింగ్ కాలేజీ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందులో వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజని, ఇతర అధికారులు పాల్గొంటారు. రెండు రోజుల పాటు విద్యార్థులు సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తారు.



ఇలాగైతే అవినీతి ఎలా వెలుగు చూస్తుంది?

పుత్తూరు మున్సిపాలిటీలో అప్పటి పాలకులు ప్రతి పనిలో దోపిడీకి పాల్పడ్డారు. కౌన్సిల్ సమ్మతి లేకుండా, టెండర్లు పిలవకుండా చాలా పనులు చేశారు. నిబంధనలను పాటించలేదు. ఇలా మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై కమిషన్ వేసినందుకు మంత్రికి ధన్యవాదాలు. అయితే, అక్రమాలు జరిగాయని చెబుతున్న కాలంలో పనిచేసిన వారే ఈ కమిషన్‌లో సభ్యులుగా ఉన్నారు. ఇలాగైతే అక్రమాలు ఎలా వెలుగు చూస్తాయి? చిత్తశుద్ధి కలిగిన వారిని విచారణాధికారులుగా నియమించాలి.

- గాలి భానుప్రకాష్, నగరి ఎమ్మెల్యే

ప్రాథమిక విచారణ పూర్తయింది

పుత్తూరు మున్సిపాలిటీలో ఎస్ఎస్ ట్యాంక్ రిపేర్ పనులకు టెండర్లు పిలవకుండా రూ.45.82 లక్షలకు శ్రీహర్ష ఎర్త్ మూవర్స్‌కు నామినేషన్ పద్ధతిన అప్పగించారు. ఇది నిబంధనలకు విరుద్ధం. రూ.5.9 లక్షలకు కాలువలు శుభ్రపరిచే పనులను 32 వర్క్‌లుగా విభజించి.. ఒకేరోజు పేమెంట్ చేశారు. రూ.2.5 లక్షల స్వచ్ఛభారత్ పెయింటింగ్ పనిని 15 వర్క్‌లుగా విభజించారు. మొదటి సారి స్క్రాప్‌ను రూ.3.8 లక్షలకు అమ్మారు. ఆర్డీ విచారణలో ఎస్టిమేషన్ తయారీ, టెక్నికల్ ఆమోదం, టెండర్ ఈ-ప్రొక్యూర్‌మెంట్, వర్క్ ఆర్డర్ ఇష్యూ, ఎంబుక్ నమోదు, థర్డ్‌పార్టీ కంట్రోల్ వంటివి లేవని తేలింది. ఇప్పటి వరకు ప్రాథమిక విచారణ పూర్తయింది. మున్సిపల్ కార్యాలయం, డంపింగ్ యార్డ్, 14వ ఆర్థిక సంఘం తదితర అంశాలపై ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కోరిన విధంగా విచారణ చేయిస్తాం. 2019-24 కాలంలో పనిచేసిన అధికారులకు విచారణ విధులు కేటాయించం.

- మంత్రి నారాయణ స్పందన

జగనన్న కాలనీ అక్రమాలపై విచారణ జరిపించండి



వెంకటగిరిలోని జగనన్న కాలనీలో వైసీపీ ప్రభుత్వంలో అడ్డగోలుగా ప్లాట్లు కేటాయించి అక్రమాలకు పాల్పడ్డారు. అలాగే, టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏపి టిడ్కో ద్వారా 2400 పేద కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేశారు. సామాజిక అవసరాల కోసం కొంత స్థలాన్ని వదిలి పెట్టారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రాగానే ఆ స్థలంలో 111 మంది అనర్హులకు ప్లాట్లు కేటాయించారు. వీటన్నిటిపై ఉన్నత స్థాయి విచారణ జరిపించండి.

- కురుగొండ్ల రామకృష్ణ, వెంకటగిరి



స్వర్ణముఖి నదికి 'గంగ'ను వదలండి



ఎండాకాలం స్వర్ణముఖినది ఎండి పోతుంది. దీనివల్ల పెళ్లకూరు, నాయుడుపేట, ఓజిలి, దొరవారిసత్రం.. గూడూరు నియోజకవర్గంలోని చిట్టమూరు, వాకాడు మండలాల్లో సుమారు 65 గ్రామాలకు తాగు, సాగునీటి ఇబ్బందులు ఎదురవుతాయి. ఏటా తెలుగు గంగ కాలువ నుంచి రెండు టీఎంసీల నీటిని విడుదల చేస్తే ఈ సమస్య పరిష్కారం అవుతుంది.

- నెలవల విజయశ్రీ, సూళ్లూరుపేట ఎమ్మెల్యే

రైల్వేస్టేషన్ నుంచి తిరుమల బస్సులు నడపాలి



గూడూరు రైల్వే జంక్షన్. ఉత్తరాది రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పలు రైళ్లలో గూడూరుకు వచ్చి.. బస్సులలో తిరుమలకు వెళ్తుంటారు. వీరికోసం గతంలో గూడూరు రైల్వేస్టేషన్ నుంచీ తిరుమలకు బస్సులు నడిపేవారు. గత వైసీపీ ప్రభుత్వం వీటిని నిలిపేసింది. వీటిని పునరుద్ధరించాలి.

- పాశిం సునీల్ కుమార్, గూడూరు ఎమ్మెల్యే

వైసీపీ పాలనలో మైనార్టీల అభివృద్ధి శూన్యం



గత పాలకులు మైనార్టీలపై తీవ్ర వివక్ష చూపారు. కనీస సౌకర్యాలు లేకుండా శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని మైనార్టీ ప్రార్థనా మందిరాలు దారుణ పరిస్థితుల్లో ఉన్నాయి. మైనార్టీల ప్రార్థనా మందిరాల నిర్వహణ కోసం కూటమి ప్రభుత్వం వార్షిక నిధులు మంజూరు చేయడం ద్వారా వారికి ఎంతో మేలు జరుగుతుంది. మైనార్టీ ప్రజలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు.

- బొజ్జల సుధీర్ రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

మంజూరైన సబ్‌స్టేషన్లకు టెండర్లు పిలవాలి



పిచ్చాటూరు మండలం ముడియూరు, సత్యవేడు మండలం చమర్తికండ్రిగలకు కొత్తగా సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి. వీటి నిర్మాణానికి టెండర్లు పిలిచి, పనులు పూర్తి చేయాలి. పిచ్చాటూరు, బుచ్చినాయుడుకండ్రిగ మండలాల్లో బాలికోన్నత పాఠశాలలను ఏర్పాటు చేయాలి. నాగలాపురం, నారాయణవనం, పిచ్చాటూరు మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో అర్ధంతరంగా ఆగిన అదనపు తరగతి గదుల పనులను పూర్తి చేయాలి.

- కోనేటి ఆదిమూలం, సత్యవేడు ఎమ్మెల్యే

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధవారం) : 6.26

సహరి (గురువారం) : 5.03



గరిమెళ్ల పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

అన్నమయ్య సంకీర్తనల నడుమ 'గరిమెళ్ల' అంతిమయాత్ర

- పాటలతో శిష్యులు, అభిమానుల నివాళి
- ప్రభుత్వ లాంఛనాలతో బాలకృష్ణప్రసాద్ అంత్యక్రియలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య సంకీర్తనలను ఆలపిస్తూ శిష్యులు, అభిమానులు ముందు నడుస్తుండగా.. ప్రముఖ సంగీత విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ అంతిమ యాత్ర సాగింది. ఇలా పాటలతో నివాళులర్పిస్తూ.. కన్నీటి వీడ్కోలు పలికారు. అనారోగ్యంతో ఆదివారం గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ కన్నుమూయగా, మంగళవారం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. తిరుపతి నగరం భవానినగర్‌లోని గరిమెళ్ల ఇంటికి ఉదయం నుంచీ ఆయన అభిమానులు, శిష్యులు, ప్రముఖులు చేరుకున్నారు. పార్థివ దేహం వద్ద నివాళులర్పించారు. ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా యంత్రాంగం అక్కడికి చేరుకుని నివాళులర్పించారు. జాతీయ పతాకాన్ని కప్పారు. అనంతరం అంతిమయాత్ర మొదలై.. హరిశ్చంద్ర శ్మశాన వాటిక వరకూ సాగింది. ఈ యాత్రలో ఆయన శిష్యులు అన్నమయ్య సంకీర్తనలను ఆలపిస్తూ ముందుకు కదిలారు. శ్మశాన వాటికలో గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ గౌరవార్థం పోలీసులు గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి గౌరవ వందనం పలికారు. ఆయన చిన్న కుమారుడు అనిల్‌కుమార్ చితికి నిప్పు అంటించారు. అంత్యక్రియల్లో గరిమెళ్ల బాలకృష్ణ సతీమణి రాధమ్మ, తనయుడు, కుటుంబీకులు తదితరులు పాల్గొన్నారు. టీటీడీ పాలకమండలి సభ్యురాలు, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి,కాంగ్రెస్ నాయకురాలు ప్రమీలమ్మ, సీపీఎం నాయకుడు కందారపు మురళి, గాయని కర్రి విజయలక్ష్మి, తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, గాయని కొండవీటి జ్యోతిర్మయి, గాయకుడు కారుణ్య, టీటీడీ సీపీఆర్వో డాక్టర్ తలారి రవి తదితరులు నివాళులర్పించారు.



విలపిస్తున్న సహ గాయని బుల్లెమ్మ



అంతిమయాత్రలో పాల్గొన్న టీటీడీ సభ్యురాలు పనబాక లక్ష్మి, గాయని కొండవీటి జ్యోతిర్మయి తదితరులు





గరిమెళ్ల గౌరవార్థం గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు - రోదిస్తున్న రాధమ్మకు సముదాయింపు

గరిమెళ్ల విగ్రహ ఏర్పాటుకు కృషి

ప్రపంచానికి అన్నమయ్య సంకీర్తనలను అందించిన గొప్ప వ్యక్తి గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్. అలాంటాయన మృతి తీరని లోటు. అనేక మంది గరిమెళ్ల అభిమానులు ఆయనకు పద్మశ్రీ పురస్కారం ప్రకటించాలనీ, తిరుపతిలో గరిమెళ్ల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం. అన్నమయ్య కీర్తనలతో కూడిన పుస్తక ప్రసాదాన్ని భక్తులకు అందించేలా టీటీడీ కృషి చేయాలనీ పలువురు కోరారు. ఈ విషయాన్ని టీటీడీ దృష్టికి తీసుకెళతాం. ముఖ్యంగా తిరుపతిలో గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి కృషి చేస్తాం.

- కలెక్టర్ వెంకటేశ్వర్

పద్మశ్రీ పురస్కారానికి ప్రతిపాదన చేస్తా

టీటీడీ ద్వారా గరిమెళ్ల కుటుంబానికి అవసరమైన సహకారం అందించేందుకు తోడ్పడతాను. అనేక మంది గాయకులు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్‌కు పాట రూపంలో నివాళులర్పించడం గర్వంగా ఉంది. ఇంత కాలం పద్మశ్రీ అవార్డు గరిమెళ్లకు ఎందుకు రాలేదో అర్థం కావడం లేదు. వెయ్యి అన్నమయ్య కీర్తనలను స్వరపరచిన గొప్ప విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్. ఈ నెల 25వ తేదీన జరిగే టీటీడీ పాలకమండలి సమావేశంలో గరిమెళ్లకు పద్మశ్రీ పురస్కారం కోసం సిఫార్సు చేయాలనే ప్రతిపాదన చేస్తా. గరిమెళ్లను కోల్పోవడం సంగీత ప్రపంచానికి తీరని లోటు. టీటీడీకి, అన్నమాచార్య సంకీర్తనలు ఇష్టపడే ప్రతి ఒక్కరికీ తీరని బాధ.

- పనబాక లక్ష్మి, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యురాలు

ఆర్థిక దృష్టి లేని విద్వాంసులు.. గరిమెళ్ల

బాలకృష్ణప్రసాద్, రాధ ఇద్దరూ మాకు చాలా సన్నిహితులు. మా పిల్లలకు సంగీత విద్యను నేర్పారు. అన్నమయ్య పాటలకు స్వరకల్పన చేసిన గరిమెళ్ల ఏనాడు ఆర్థికాభివృద్ధిని కోరుకోలేదు. గరిమెళ్ల కుమారులిద్దరూ చాలా మంచి వారు. వైష్ణవ సంప్రదాయం ప్రకారం ఏకాదశి మరణం, ద్వాదశి దహనం చాలా మంచివని అంటారు. గరిమెళ్ల కృషికి శ్రీవారే ఈ అవకాశం కల్పించారు. రాధమ్మకు మనశ్శాంతి కలగాలని కోరుకుంటున్నా.

- ప్రమీలమ్మ, కాంగ్రెస్ నాయకురాలు

అన్నమయ్య పాటలు పాడటంలో అగ్రగణ్యులు

గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ అంటే తెలియని సంగీతాభిమానులు ఉండరు. టీటీడీతో ఉన్న అనుబంధం, అన్నమయ్య సంకీర్తనలను వెలుగులోకి తీసుకురావడం చాలా గొప్ప విషయాలు. తిరుపతితో ఆయనకు ఎంతో అనుబంధం ఉంది. ఒకే వేదిక మీద అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నాం. గరిమెళ్ల మృతి సంగీత ప్రపంచాన్ని శోకసంద్రంలోకి నెట్టింది. వ్యక్తిగతంగా నాకు బాగా పరిచయం. ప్రజానుకూలంగా, అభ్యుదయంగా ఆలోచించే వారు. గరిమెళ్ల మృతి తీరని లోటు.

- కందారపు మురళి, సీపీఎం నాయకుడు

గరిమెళ్ల పాడిన పాటలను మరింత ప్రాచుర్యంలోకి తెస్తాం

అన్నమయ్య పాటలంటే గరిమెళ్లకు ప్రాణం. గరిమెళ్ల గొంతులో అన్నమయ్య పాటలు జీవం పోసుకున్నాయి. ఇంత గొప్ప సంగీతాన్ని గరిమెళ్ల పాడిన పాటలను మరింత ప్రాచుర్యంలోకి తెచ్చేందుకు ప్రయత్నం చేస్తాం.

- డాక్టర్ కర్రి విజయలక్ష్మి, గాయని

జిల్లా ఇన్‌చార్జి అధికారిగా శశిధర్

- జోనల్ ఇన్‌చార్జిగా ఎంటీ కృష్ణబాబు



కోన శశిధర్



కృష్ణబాబు

తిరుపతి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లా, జోనల్ స్థాయిల్లో సీనియర్ ఐఏఎస్‌లను ఇన్‌చార్జి అధికారులుగా నియమించింది. జిల్లా ఇన్‌చార్జిగా పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి కోన శశిధర్.. తిరుపతితో పాటు ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య జిల్లాలతో కూడిన జోన్‌కు ఇన్‌చార్జిగా వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు నియమితులయ్యారు. వీరిలో జిల్లా ఇన్‌చార్జి అధికారి.. తరచూ పర్యటిస్తూ ప్రభుత్వ కార్యక్రమాల అమలును పర్యవేక్షించాలి. ప్రతి పదిహేను రోజులకూ ఓసారి జిల్లా అధికారులతో సమావేశమై సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరును సమీక్షించాలి. గ్రామాల్లో పర్యటించడంతో పాటు నెలకు కనీసం రెండు సార్లు పల్లె బస చేయాలి. ప్రజల నుంచీ వచ్చిన ఫిర్యాదుల పరిష్కారాలపై సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలి. నెలవారీ పురోగతికి సంబంధించిన నివేదికలను జోనల్ ఇన్‌చార్జికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందజేయాలి.

- ఇక, ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలు, పథకాల అమలు విజయవంతానికి జోనల్ ఇన్‌చార్జి వ్యూహాత్మక మార్గదర్శకత్వం అందించాలి. జిల్లా స్థాయిలో నెలవారీ సమీక్షా సమావేశాలు నిర్వహించాలి. ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాల్లో పాల్గొనాలి. నెలకోసారి గ్రామాలను సందర్శించి రాత్రి బస చేయాలి. పారిశ్రామికవేత్తలు, రైతులు, లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, పన్ను చెల్లింపుదారులతో సమావేశం కావాలి. కలెక్టర్ సహా జిల్లా అధికారులకు అవసరమైన శిక్షణ ఇవ్వాలి. ప్రజా ఫిర్యాదుల పరిష్కార స్థితిని సమీక్షించాలి. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అవాంతరాలను గుర్తించి, వాటికి కారణాలేమిటన్నది విశ్లేషించాలి. ముఖ్యమైన ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు, నిధుల వ్యయం వంటి అంశాలను సమీక్షించాలి. జిల్లా పురోగతితో పాటు సమస్యలు, సిఫారసులతో కూడిన నివేదికలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందజేయాలి.





తెప్పపై శ్రీనివాసుడి విహారం

శ్రీవారి తెప్పోత్సవాల్లో భాగంగా మూడోరోజు మంగళవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి పుష్కరిణిలో తెప్పపై విహరించారు. సాయంత్రం ఆలయ మాడవీధుల్లో ఊరేగిన ఉత్సవమూర్తులు తర్వాత పుష్కరిణికి చేరుకుని తెప్పలో కొలువుదీరారు. రాత్రి 7 నుంచి 8 గంటల వరకు తెప్పపై పుష్కరిణిలో మూడుసార్లు విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవాయిద్యాలు, వేదపారాయణం, అన్నమయ్య సంకీర్తనల మధ్య తెప్పోత్సవం కన్నులపండువగా జరిగింది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

డీ టైప్ క్వార్టర్స్‌లో నాగుపాము



తిరుమల డీటైప్ క్వార్టర్స్‌లోని ఒక గదిలోకి చొరబడిన నాగుపామును మంగళవారం భాస్కరనాయుడు పట్టుకున్నారు. దాదాపు ఐదున్నర అడుగుల పొడవైన ఈపామును అడవిలో విడిచిపెట్టారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

ఈ-పంట నమోదు జాబితా పరిశీలన



భాకరాపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌కు సంబంధించి ఈ-పంటలో నమోదు అయిన జాబితాను పరిశీలిస్తున్నట్లు వ్యవసాయ అధికారి ధనలక్ష్మి తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండలం దీన్‌దార్లపల్లె పంచాయతీలో ఈ-పంట నమోదు చేసుకున్న రైతుల జాబితాను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024-25 రబీ సీజన్‌లో 71 మంది రైతులకు ఈ-పంట యాప్‌లో 1139.14 ఎకరాలు నమోదు పూర్తి చేశామన్నారు. 750 ఎకరాలకు సంబంధించిన 530 మంది రైతులకు ఈ-కేవైసీ కూడా పూర్తి చేశా మన్నారు. రైతుల జాబితాను ఈ నెల 14 వరకు రైతు సేవా కేంద్రంలో ప్రదర్శిస్తామన్నారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 19వ తేదీలోపు రాతపూర్వకంగా తెలియజేస్తే వాటిని సరిచేసి ఈ నెల 22న తుది జాబితా విడుదల చేస్తామని పేర్కొన్నారు.

హేమాంబరధరరావుకు పలువురి శుభాకాంక్షలు



చంద్రగిరి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు జన్మదిన వేడుకలు మంగళవారం తిరుపతిలో ఘనంగా జరిగాయి. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్నేహితులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మధ్యాహ్నం ఆయన అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

రాళ్లపల్లెకు ఘన నివాళి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత సంగీత, సాహిత్య విద్వాంసులు రాళ్లపల్లె అనంతకృష్ణ శర్మ విగ్రహానికి టీటీడీ ఘన నివాళి అర్పించింది. రాళ్లపల్లె వర్ధంతి సందర్భంగా తిరుపతిలోని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. అనంతరం అన్నమాచార్య కళామందిరంలో నిర్వహించిన సభలో రాళ్లపల్లె మనుమరాలు ప్రొఫెసర్ దీప్తి, అవధాని ఆముదాల మురళి, సంస్కృత అధ్యాపకులు గంగిశెట్టి లక్ష్మీనారాయణ మాట్లాడారు. సంగీత, సాహిత్య రంగాలకు రాళ్లపల్లె అనంతకృష్ణశర్మ ఎంతో గొప్ప కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండు కార్ల స్వాధీనం

● ఇద్దరు నిందితుల అరెస్టు



బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బాడుగకు తీసుకుని అమ్మేసిన రెండు కార్లను స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ తిమ్మయ్య, ఎస్‌ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో రికవరీ చేసిన కార్లను, అరెస్టు చేసిన ఇద్దరు నిందితులను మంగళవారం విలేకరుల సమావేశంలో చూపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఆర్‌అనంతపురానికి చెందిన మహేష్.. తిమ్మాభూపాలపురానికి చెందిన ఉమాశంకర్ కు రెండు కార్లను నెల బాడుగకు ఇచ్చాడు. అయితే ఉమాశంకర్ తన అనుచరులు దశరథన్, జాఫర్‌బాషాతో కలసి రికార్డులను తారుమారు చేసి పాకాలకు చెందిన వారికి అమ్మేశారు. బాడుగ ఇవ్వకపోగా కార్లను అమ్మేశాడంటూ పోలీసుస్టేషన్‌లో మహేష్ ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ తిమ్మయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కార్లు పాకాలలో ఉన్నట్లు సమాచారం అందడంతో వాటిని స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చారు. ఉమాశంకర్ పరారీలో ఉండటంతో దశరథన్, జాఫర్ బాషాను అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా ప్రదోష పూజలు



ప్రదోష నందికి చందనాభిషేకం

నాగలాపురం, మార్చి 11, (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో మంగళవారం ప్రదోష పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలోని పరివార దేవతలకు ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుకుల్ అభిషేకాలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలోని నందీశ్వరుడికి అభిషేకాలు చేసి దీప, ధూప నైవేద్యాలు సమర్పించారు. తదనంతరం స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి మంగళ వాయిద్యాల నడుమ నక్షత్ర, కుంభ, మహా హారతులు చేపట్టారు. హారతి అనంతరం మరగదాంబిక సమేత వాల్మీకేశ్వరస్వామి ఉత్సవమూర్తులను దివ్యాంగ సుందరంగా అలంకరించి ఆలయ ఆవరణలో ప్రాకారోత్సవం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు.



స్వామిఅమ్మవార్ల ప్రాకారోత్సవం

మెరుగైన వైద్య సేవలు అందించాలి



దామలచెరువు పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీపీఎంవో శ్రీనివాసులు

పాకాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మెరుగైన వైద్య సేవలు అందించాలని డీపీఎంవో శ్రీనివాసులు వైద్య సిబ్బందికి సూచించారు. మంగళవారం దామలచెరువు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. గర్భిణులను, బాలింతలతో మాట్లాడారు. వారికి అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీపీవో ప్రకాష్, వైద్యాధికారి రవిరామ్ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

18లోపు ఈ-పంట నమోదు చేసుకోవాలి

పాకాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు రబీ సీజన్ 2024-25కు సంబంధించి ఈ-పంట నమోదు ఈనెల 18వ తేదీ లోపు చేసుకోవాలని ఏవో పుష్పవతి తెలిపారు. వడ్డీలేని పంట రుణాలు, మద్దతు ధర, ఉత్పత్తుల కొనుగోలు, పంటల బీమా, పంట నష్ట పరిహారం పొందాలంటే ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని తెలియజేశారు.

వైసీపీ మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా వల్లీ



తిరుపతిరూరల్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి నియోజకవర్గ వైసీపీ మైనారిటీ సెల్ అధ్యక్షుడుగా తిరుపతి రూరల్ మండలం కుంట్రపాకం పంచాయతీకి చెందిన కరమల వల్లీ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు.

15న జాబ్‌మేళా

శ్రీకాళహస్తి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఈనెల 15వ తేదీ శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, కళాశాల ప్రిన్సిపాల్ నాగ రాజునాయుడు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజీ, సీడాప్, డీఆర్‌డీఏ, జేకేసీ సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలు బహుళ జాతీయ కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టెన్త్, ఇంటర్మీ డియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులైన యువతీ యువకులు అర్హులన్నారు. ఆధార్‌కార్డు, విద్యార్హత ధృవపత్రాల జిరాక్సు కాపీలు, బయోడేటాతో పాటు సంబంధిత రిజిస్ట్రేషన్ లింక్‌లో నమోదు చేసుకున్న అడ్మిట్‌కార్డుతో హాజరు కావాలన్నారు. వివరాలకు నెం. 7989509540, 8919889609లలో సంప్రదించాలన్నారు.

పాముకాటుతో వృద్ధురాలి మృతి



సావిత్రమ్మ (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పాముకాటుతో వృద్ధురాలు మృతి చెందింది. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు... శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరికి చెందిన సీతారాం వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఆయన తల్లి సావిత్రమ్మ(76) వినికిడి లోపంతో పాటు మాట్లాడలేదు. సోమవారం రాత్రి ఇంటి ఆవరణలో బహిర్భూమికి వెళ్లింది. కాసేపటి తరువాత ఆమె నోటి నుంచి నురగ రావడాన్ని గమనించిన కుమారుడు పాముకాటుకు గురైనట్లు గుర్తించాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించే లోపు ఆమె మృతి చెందింది. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి



చల్లాఆదినారాయణ (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో రైతు మృతిచెందాడు. శ్రీకాళహస్తి మండలం రామలింగాపురానికి చెందిన చల్లా ఆదినారాయణ(60) రైతు. ఆయన ట్రాక్టరుకు మరమ్మతులు అవసరం కావడంతో డ్రైవర్‌ను వెంటబెట్టుకుని సోమవారం ఏర్పేడుకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకున్న అనంతరం ట్రాక్టరులో వెనుక కూర్చున్నాడు. మార్గమధ్యంలో శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి వద్ద పీఎస్ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆదినారాయణను చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి మంగళవారం ఏరియా ఆస్పత్రి మార్చురీలో పోస్టుమార్టం పూర్తి చేసిన అనంతరం బంధువులకు అప్పగించారు.

మూడు వాహనాలకు జరిమానా

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రికార్డులు సక్రమంగా లేకుండా నడుపుతున్న మూడు వాహనాలకు శ్రీకాళహస్తి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ దామోదర్‌నాయుడు రూ.65వేలు జరిమానా విధించారు. మంగళవారం బీఎన్‌కండ్రిగ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్‌ఐ విశ్వనాథం నాయుడితో కలిసి వాహన తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పలు వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. చోదకులు తప్పకుండా రికార్డులను తమ వాహనంలో ఉంచుకోవాలని చెప్పారు. హెల్మెట్, సీటుబెల్టు కచ్చితంగా ధరించాలన్నారు. ఇకపై సీటు బెల్టు, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే జరిమానా విధిస్తామన్నారు. పలు వాహనాలకు సంబంధించి డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.

రూ.19 కోట్లతో తలకోన అభివృద్ధి

ఎమ్మెల్యే నాని అభ్యర్థనకు ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకారం



అభివృద్ధి పనుల ప్రాజెక్టు నివేదికను చంద్రబాబుకు అందిస్తున్న ఎమ్మెల్యే నాని

ఎర్రావారిపాళెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రం తలకోన ఆలయాన్ని రూ.19కోట్లతో అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే పులివర్తి నాని సీఎం చంద్రబాబును కోరారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల అనంతరం ముఖ్యమంత్రిని ఆయన కలిశారు. ఇటీవల మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలలో రెండు రోజులు ఎమ్మెల్యే అక్కడే ఉండి భక్తుల శివరాత్రి జాగరణకు పడుతున్న అవస్థలను స్వయంగా చూశారు. ఈ క్రమంలో తలకోన అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనల నివేదికను చంద్రబాబుకు అందజేశారు. ఆలయ ప్రహరీ బీటలు వారిందని, సిద్ధమండపం ఇరుకుగా ఉందని, క్యూ లైన్‌లకు స్థలం లేదని వివరించారు. స్వామి, అమ్మవార్ల గర్భాలయాలు, అర్ధమండపం, ముఖ మండపం, పరివార దేవతల ఆలయాలు, ధ్వజ స్తంభం, బలిపీఠం, ప్రాకారం, రాజగోపురం, పోటు, ఉగ్రాణం, పుష్కరిణి, కళ్యాణకట్ట, పాలక మండలి కార్యాలయాలను శిల్పాలతోనే నిర్మించేలా చూడాలని విన్నవించారు. మహా శివరాత్రి రోజు దాదాపు 60వేల మంది వస్తుంటారని వారికి తగిన వసతులు కల్పించాలని విజ్ఞప్తిచేశారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించారు. ఈ పనులకు టీటీడీ నిధులను వెచ్చించనున్నారని, త్వరలోనే సీఎంఓ నుంచి ఆదేశాలు జారీ కానున్నాయని సమాచారం.

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల వెల్లువ

తక్కువ యూనిట్లు ● నిరాశలో యువత



ఇంటర్వ్యూలకు హాజరైన యువత (ఫైల్‌ఫొటో)

చంద్రగిరి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. చంద్రగిరి నియోజకవర్గంలో మొత్తం ఆరు మండలాల్లో 364 యూనిట్లు మంజూరుకాగా 3143 మంది నిరుద్యోగులు రుణాలుకు దరఖాస్తు చేసుకొన్నారు. అందులో నియోజకవర్గ కేంద్రమైన చంద్రగిరిలో 68 యూనిట్లకు 562 దరఖాస్తులు వచ్చాయి. పాకాలలో.51 యూనిట్లకు 511, చిన్నగొట్టిగల్లులో .35 యూనిట్లకు 105 దరఖాస్తులు, ఎర్రావారిపాళెంలో 38 యూనిట్లకు 308 దరఖాస్తులు, రామచంద్రాపురంలో .57 యూనిట్లకు 210, తిరుపతి రూరల్ మండలంలో 115 యూనిట్లకు 1447 దరఖాస్తులు వచ్చాయి. గత వైసీపీ ప్రభుత్వంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడం, స్వయం ఉపాధి కల్పనకు చర్యలు తీసుకోకపోవడంతో నిరుద్యోగ సమస్య తీవ్రమైంది. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో యువతకు స్వయం ఉపాధి కల్పనకు రాయితీ రుణాలు ఇవ్వనుండడంతో యువత ఆశలు పెంచుకున్నారు. అయితే ప్రభుత్వం యూనిట్లు తక్కువ ఇవ్వడంతో నిరాశ చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి యూనిట్లు సంఖ్య పెంచాలని నిరుద్యోగ యువత కోరుతున్నారు.

యానాది కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సంఘనాయకులు శ్రీనివాస్ తదితరులు

తిరుపతిరూరల్, మార్చి11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు యానాది కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని యానాది మహానాడు ఆల్ ఇండియా సంఘ జాతీయ అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ కోరారు. ఎమ్మార్ పల్లెలోని యూత్‌హాస్టల్‌లో సంఘ జిల్లా అధ్యక్షుడు కంబాల ఈశ్వరయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బాదూరి సావిత్రమ్మ మాట్లాడుతూ అన్యాక్రాంతం అయిన గిరిజనుల భూములు తిరిగి వారికే అప్పగించాలని కోరారు. మైదానప్రాంత గిరిజనులకు 3 ఎమ్మెల్సీలు, ఆదివాసీ గిరిజనులకు 3 కార్పొరేషన్లు, ప్రతిగిరిజన కుటుంబానికి 5ఎకరాల భూమి, ఎస్టీ వర్గీకరణ, నిరుపేదలకు అంత్యోదయకార్డులు, ప్రతినియోజకవర్గానికీ ఒక ఏకలవ్య గురుకులం, వృత్తి పింఛన్, కాలనీలకు కమ్యూనిటీ హాల్స్, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ పెంపు, పారిశుధ్య కార్మికుల రెగ్యులరైజేషన్, మూడవ, నాల్గవ తరగతి ఉద్యోగులకు 3 సెంట్ల స్థలం కేటాయించాలని సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చౌటూరు శీనయ్య, భాగ్యలక్ష్మి, బుజ్జమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణ



బోడెంబాయి వద్ద ఫుట్‌ఫాత్‌పై అక్రమంగా నిర్మించిన వాణిజ్య సముదాయం

చంద్రగిరి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం బోడెంబాయి వద్ద పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో నేషనల్ హైవే ఆఫ్ ఆథారిటీకి సంబంధించిన భూమిలో అక్రమంగా వాణిజ్య సముదాయం నిర్మించారు. మొరవపల్లెకు చెందిన ఓ రైతు వ్యవసాయ భూమిని పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి ఆరులైన్ల విస్తరణలో ఎన్‌హెచ్‌ఏఐ సేకరించింది. ఇందుకు రైతుకు నష్ట పరిహారం చెల్లించింది. రోడ్డుకు పోను సుమారు మూడు అడుగుల వరకు స్థలం మిగిలి ఉండటంతో ఆ వ్యక్తి ఏకంగా తొమ్మిది అడుగుల పైన ఆక్రమించి వాణిజ్య సముదాయం నిర్మించాడు. నిత్యం ఎన్‌హెచ్‌ఏఐ సిబ్బంది తమ మొబైల్ వాహనంలో ఆదారిలో గస్తీ నిర్వహిస్తుంటారు. అయినా అక్రమ నిర్మాణాన్ని పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఇకనైనా నేషనల్ హైవే ఆఫ్ ఆథారిటీ అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తిరుపతిలో మే 15న ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు

తిరుపతి(ఆటోనగర్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మే 15 నుంచి 18వ తేదీ వరకు ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ వెల్లడించారు. తిరుపతిలోని గంధమనేని శివయ్య, కృష్ణారెడ్డి భవన్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని పదేళ్ల క్రితం హామీ ఇచ్చిందని, నేటికి 20 కోట్ల ఉద్యోగాలు భర్తీ జరిగాయా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటిస్తాయని, ఓట్లు వేయించుకున్న అనంతరం నిరుద్యోగ సమస్యను గాలికి వదిలేస్తున్నారని ఆయన మండిపడ్డారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం కోసం యువతరం తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

ఫైర్ ఎన్వోసీ కాలపరిమితిని పదేళ్లకు పెంచండి

● రాష్ట్ర ఫైర్ డీజీ ప్రతాప్‌రెడ్డిని కోరిన అప్సా



ఫైర్ డీజీకి వినతిపత్రం అందజేస్తున్న అప్సా నాయకులు సుబ్రహ్మణ్యంరాజు, మురళీమోహన్, చంద్ర

తిరుపతి(విద్య), మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి ఫైర్ ఎన్వోసీ కాలపరిమితిని 10 సంవత్సరాలకు పెంచాలని ఏపీ ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ (అప్సా) నాయకులు ఫైర్ సర్వీసెస్ రాష్ట్ర డీజీ మాదిరెడ్డి ప్రతాప్‌రెడ్డిని కోరారు. డీజీ మంగళవారం తిరుపతికి వచ్చిన సందర్భంగా ఓ ప్రైవేటు హోటల్లో ఆయనను కలిసిన అప్సా నాయకులు దుశ్శాలువతో సన్మానించి, అభినందనలు తెలిపారు. అనంతరం ఈమేరకు అభ్యర్థించి వినతి పత్రం అందజేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.సుబ్రహ్మణ్యంరాజు మాట్లాడుతూ... ప్రస్తుతం ఫైర్ ఎన్వోసీ ఒక సంవత్సర కాలపరిమితితో జారీ చేస్తున్నారని డీజీకి వివరించారు. అలాగే 15 మీటర్ల ఎత్తున్న పాఠశాల భవనాలకు నిబంధనలు లేకుండా ఫైర్ ఎన్వోసీ ఇవ్వాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు, ఇతర నాయకులు మురళీమోహన్, చంద్ర, రాజారెడ్డి, విజయకుమార్ డీజీని కలిసినవారిలో ఉన్నారు.

కాశీ విశ్వేశ్వరుడికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొలువై ఉన్న కాశీ విశ్వేశ్వర స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. త్రయోదశిని పురస్కరించుకుని ముందుగా స్వామివారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అంగన్‌వాడీ కేంద్రం తలుపులకు నిప్పంటించిన గుర్తు తెలియని వ్యక్తులు



పిచ్చాటూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కారూరు అంగన్‌వాడీ కేంద్రం తలుపునకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. స్థానికుల సమాచారం మేరకు... కారూరు ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం తలుపులకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించినట్లు తెలిపారు. అలాగే ఈ అంగన్‌వాడీ కేంద్రం చీకటి పడితే అనేక రకాలైన అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోందని స్థానికులు వాపోతున్నారు. మద్యం మత్తులో మందుబాబులు నిప్పంటి ఉంటారని భావిస్తున్నారు. పోలీసులు రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించాలని, తద్వారా చోరీలు, నేరాల శాతం తగ్గుముఖం పడుతాయని స్థానికులు కోరుతున్నారు.

అంతర పంటగా ఔషధ మొక్కలు

రేణిగుంట, మార్చి 11, (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలో స్వల్ప కాలిక ఔషధ మొక్కలను అంతర పంటగా సాగు చేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని కేరళ ఫారెస్ట్ రీసెర్చి సెంటర్, జాతీయ ఔషధ మొక్కల బోర్డు రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కేసీ చాకో తెలిపారు. మంగళవారం మండలంలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం గుత్తివారిపల్లి రాస్ కేంద్రంలో ఔషధ మొక్కలు సాగు, మార్కెటింగ్‌పై రైతులకు అవగాహన కల్పించారు. స్వల్ప కాలిక పంటలైన అశ్వ గంధ, సర్పగంధ, బావంచాలు తదితరాలను సాగు చేయవచ్చన్నారు. రీజనల్ ఫస్ట్ లెసన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్, కె.వి.కె. హెడ్ డాక్టర్ శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు పద్మజ, దివ్య, సుధా, ఎస్‌ఆర్‌ఎస్‌లు పాల్గొన్నారు.

వేంబాక్కం ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేటు



నాగలాపురంలో జరిగిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక

నాగలాపురం, మార్చి 11, (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం తిరుపతి జిల్లా డ్వామా పథక సంచాలకుడు శ్రీనివాస ప్రసాద్ ఆధ్వర్యంలో 17వ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై, గత నెలలో 12వ తేదీ నుంచి 28 వరకు సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీకి సంబంధించి ఉపాధిహామీ, పంచాయతీ రాజ్, గృహ నిర్మాణ శాఖ, సర్వశిక్షా అభియాన్, పశు సంవర్థక శాఖలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో భాగంగా మండలంలోని వేంబాక్కం ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణపై పలు అభియోగాలు సభ దృష్టికి వచ్చాయి. అభియోగాలు నిర్ధరణతో పాటు రూ.76 వేలు దుర్వినియోగానికి పాల్పడినట్లు తేలింది. దీంతో అతడిని విధుల నుంచి తొలగిస్తూ, నగదు రికవరీకి ఆదేశించడమే కాకుండా రూ.5వేలను జరిమానా వేశారు. పంచాయతీరాజ్ శాఖలో కాంట్రాక్టర్‌కు బదులుగా ఈఈ ఖాతాకు బదిలీ అయిన రూ.7.42 లక్షలను రికవరీ చేయాల్సిందిగా ఆదేశించారు. వేంబాక్కంలో తప్పుడు నివేదిక ఇచ్చిన ఉపాధి ఏపీడీ, ఏపీవోలను సస్పెండ్ చేయాలంటూ గ్రామస్తులు పీడీని కోరారు. కాగా ఈ కార్యక్రమానికి పదిహేను మంది సర్పంచులతో పాటూ పూర్తిస్థాయిలో ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. డీవీవో శివయ్య, ఏపీడీ సరిత, ఎంపీడీవో వెంకటరత్నమ్మ, ఏపీవో సుధాకర్ పాల్గొన్నారు.

దళిత స్త్రీ వేదనను చిత్రించిన కవిత్వం

- డాక్టర్ భీమన్న



భీమన్నను సన్మానిస్తున్న తెలుగు అధ్యాపకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 11(ఆంధ్రజ్యోతి): సమాజం ఎంతో అభివృద్ధి సాధించినప్పటికీ దళిత మహిళ నేటికీ వివక్షను అనుభవిస్తూ ఉందని ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ తెలుగు అధ్యాపకులు డాక్టర్ భీమన్న తెలిపారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగంలో మంగళవారం నిర్వహించిన కటాక్షమ్మ పాల్‌రాజ్ ధర్మనిధి ఉపన్యాసంలో భాగంగా 'దళిత కవిత్వంలో స్త్రీ' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. సాహిత్యరంగంలో సామాన్యుల జీవితాన్ని ప్రతిబింబించేలా బసవేశ్వరుడి నుంచీ వేమన, వీరబ్రహ్మం వంటి సంస్కర్తలు కృషి చేశారన్నారు. ప్రత్యేకించి గద్దర్, కలేకూరి ప్రసాద్ వంటి వారు దళిత స్త్రీ జీవిత వేదనను కవిత్వంగా మలిచారని తెలిపారు. తద్వారా దళిత స్త్రీ జీవిత మార్పునకు ప్రయత్నించారన్నారు. అనేక మంది కవులు ఈ విధమైన కృషి చేశారని చెప్పారు. డీన్ విజయలక్ష్మి, తెలుగు విభాగాధిపతి కొలకలూరి మధుజ్యోతి, అధ్యాపకులు వై.సుభాషిణి, డి.యువశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం సందర్భంగా స్థానిక వీవీ మహల్ రోడ్డులోని హజరత్ సయ్యద్‌షా హుస్సేన్‌షావలి దర్గాలో మంగళవారం ఇఫ్తార్ విందు జరిగింది. యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణలు ముఖ్య అతిథులుగా పాల్గొని ఇఫ్తార్ విందు స్వీకరించారు. ముస్లిం సోదరులకు ఈద్‌ముబారక్ చెప్పారు. ఈ కార్యక్రమంలో 36వ డివిజన్ టీడీపీ నాయకులు రవిశంకర్ యాదవ్, ఆవుల శంకర్ యాదవ్, జనసేన నాయకులు ఆముదాల వెంకటేష్, మధు యాదవ్, ముని రాయల్, ప్రేమ్, వార్డు నాయకులు గౌస్ బాషా, అబ్దుల్లా యాసిన్, సల్మాన్, అన్వర్ బాషా, మస్తాన్, టీడీపీ నేతలు శ్రీనివాస యాదవ్, కృష్ణ యాదవ్, ఎస్వీఎం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పనిగంటలు పెంపునకు వ్యతిరేకంగా

మే 6న దేశవ్యాప్త సమ్మె



మాట్లాడుతున్న నరసింగరావు

తిరుపతి(ఆటోనగర్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): దేశంలో కార్మికులపై అధికారికంగా పెరుగుతున్న పనిగంటలకు వ్యతిరేకంగా మే 6న సార్వత్రిక సమ్మె చేస్తున్నట్లు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు తెలిపారు. మంగళవారం తిరుపతిలో జరిగిన సీఐటీయూ రాయలసీమ వర్క్‌షాపు ముగింపు సభలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. కొన్ని వేల మంది ప్రాణ త్యాగంతో 8 గంటల పనిదినాలు సాధించుకున్న హక్కును బీజేపీ ప్రభుత్వం చట్టాలను మార్చి కార్పొరేట్‌లకు అనుకూలంగా మార్చిందని ఆయన విమర్శించారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు రాష్ట్రంలో కార్మిక వర్గం ఐక్యమత్యంతో సమ్మెను జయప్రదం చేయడానికి సిద్ధం కావాలన్నారు. ఈ నెల 14న విశాఖ స్టీల్ ప్లాంట్ పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా కార్మిక సంఘాలు నిరసనలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కె.అజయ్‌కుమార్, కందారపు మురళి పాల్గొన్నారు.

బ్యాంకుల్లో అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి



ఇండియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

తిరుపతి(ఆటోనగర్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): దేశంలో జాతీయ బ్యాంకుల్లో అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని యూఎఫ్‌బీయూ నాయకులు విజయభాస్కర్, ధన్వంత్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక కేటీ రోడ్డులోని ఇండియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయం ఎదుట మంగళవారం ఉద్యోగులు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ గతంలో ఒప్పందం చేసుకున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారంలో ఐదు రోజుల పనిదినాలను అమలుచేయాలని కోరారు. బ్యాంకుల్లో వున్న అన్నీ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనార్ధన్, భాస్కర్, కేశవరెడ్డి, సుమలత, రేష్మనిర్మల, యగ్నేష్ బాబు, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీసీఎల్ లీగ్‌లో

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం జట్టు సత్తా



విజేతగా ఎన్ఎస్‌యూ జట్టు

తిరుపతి(క్రీడలు), మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ క్రికెట్ స్టేడియంలో మంగళవారం జరిగిన మెగా కార్పొరేటర్ క్రికెట్‌లీగ్‌లో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం(ఎన్ఎస్‌యూ), ఎస్వీడీసీఎల్ జట్లు తలపడ్డాయి. ఆద్యంతం ఉత్కంఠంగా సాగినా చివరికి ఎన్ఎస్‌యూ జట్టునే విజయం వరించింది. తొలుత ఎస్వీడీసీఎల్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 177 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన ఎన్ఎస్‌యూ జట్టు అనూహ్యంగా విజయాన్ని అందుకుంది. కెప్టెన్ ఊకా సేతురామ్ చివరి ఓవర్లో అసాధారణ ఆటతీరును కనబరచి జట్టుకు విజయం చేకూర్చాడు. దీంతో సహచరులు, ప్రేక్షకులు అభినందించారు.

నేటి నుంచి వర్క్‌షాప్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 11(ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర వేద వర్సిటీలో బుధవారం నుంచి 21 రోజుల పాటు అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఆగమ సిద్ధాంతంపై ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రారంభ సభ బుధవారం ఉదయం 10 గంటలకు పరిపాలనా భవనంలో నిర్వహిస్తారు. ఇందులో వీసీ రాణీసదాశివమూర్తి, శ్రీవారి ఆలయ ప్రధానార్చకులు అర్చకం వేణుగోపాల దీక్షితులు, ప్రముఖ వైఖానస ఆగమ పండితులు వేదాంతం సత్య శ్రీనివాస అయ్యంగార్ పాల్గొంటారని ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రాజేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



బాధితులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (కలెక్టరేట్), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న నలుగురికి కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ సీఎం సహాయనిధి నుంచి వచ్చిన చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. అందులో చిన్న గొట్టిగల్లు మండలం కుమ్మరిపల్లికు చెందిన రెడ్డెప్పకు రూ.లక్ష, తిరుపతికి చెందిన చంద్రశేఖర్‌కు రూ.1.60లక్షలు, ఆర్‌సీపురం నెన్నూరుకు చెందిన స్వర్ణలతకు రూ.2లక్షలు, కార్వేటినగరానికి చెందిన పాపమ్మకు రూ.3లక్షలు అందజేశారు.

స్వర్ణ నారావారిపల్లెకు ప్రణాళికలు రూపొందించండి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్వర్ణ నారావారిపల్లె-2029 అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలను త్వరితగతిన సిద్ధంచేసి పనులు చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో స్వర్ణ నారావారిపల్లె-2029 అభివృద్ధి ప్రత్యేక అధికారిణి సుశీలాదేవి, సంబంధిత అధికారుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా జరుగనున్న అభివృద్ధి కార్యక్రమాలపై అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, త్వరితగతిన పనులను ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, డ్వామా పీడీ శ్రీనివాస్‌ప్రసాద్, డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

హోమ్‌స్టేల్లో పోలీసుల తనిఖీలు



తిరుపతి (నేరవిభాగం), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలోని హోమ్‌స్టేల్లో సీఐ చిన్నగోవిందు సిబ్బందితో కలసి తనిఖీలు చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు హోమ్‌స్టేల్లో చట్టవిరుద్ధ కార్యక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులపై ముందస్తు చర్యగా ప్రత్యేక తనిఖీలు చేశారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు. ఎవరైనా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐలు రామకృష్ణ, షేక్షావలి పాల్గొన్నారు.

పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ ప్రవేశపరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశపరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.విశ్వనాథ్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025 మార్చిలో పదవ తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు 2025-26 విద్యాసంవత్సరం ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకుగాను నిర్వహించే ప్రవేశపరీక్షకు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష జరునుంది. అలాగే 2025-26 విద్యాసంవత్సరంలో పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 30న జరుగనున్న ప్రవేశ పరీక్షకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర వివరాలకు 86888 88802/03, 93999 76999 సెల్ నంబర్లలో విశ్వం కోచింగ్ సెంటర్‌ను సంప్రదించవచ్చు.

గెజిటెడ్ అధికారుల క్వార్టర్స్‌లో చోరీ

- 136 గ్రాముల బంగారు నగల అపహరణ



వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు

తిరుపతి (నేరవిభాగం), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలోని గెజిటెడ్ అధికారుల క్వార్టర్స్‌లో చోరీ జరిగిన విషయం మంగళవారం వెలుగులోకి వచ్చింది. సీఐ చిన్నగోవిందు కథనం మేరకు... వెంకటపతి నగర్ సమీపంలోని గెజిటెడ్ అధికారుల క్వార్టర్స్‌లో నివాసముండే కొండలరావు కుటుంబ సభ్యులతో కలసి 10 రోజుల క్రితం కుంభమేళాకు వెళ్లారు. వారు మంగళవారం తిరిగి వచ్చి చూడగా తలుపులు పగులకొట్టి ఇంటిలో వున్న 136 గ్రాముల బంగారు నగలు అపహరించుకెళ్లినట్లు గుర్తించారు. బాధితులు వెంటనే తిరుపతి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ చిన్నగోవిందు, సిబ్బంది, వేలి ముద్రల నిపుణులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వేలి ముద్రలు సేకరించారు. అక్కడ వున్న సీసీ ఫుటేజీలు తనిఖీ చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, త్వరలో నిందితులను పట్టుకుంటామని సీఐ చెప్పారు.

హోంగార్డు అభ్యర్థులకు కనీస అర్హత మార్కులు ఉంచాలి

తిరుపతి(నేరవిభాగం), మార్చి 11(ఆంధ్రజ్యోతి): మూడేళ్ల క్రితం జారీ చేసిన పోలీసు శాఖ నోటిఫికేషన్‌లో భాగంగా త్వరలో నిర్వహించనున్న ప్రధాన పరీక్షల్లో హోంగార్డు అభ్యర్థులకు కనీస అర్హత మార్కులు ఉంచాలని నిరుద్యోగ కానిస్టేబుల్ అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం సమర్పించారు. 2023లో కానిస్టేబుళ్ల భర్తీ ప్రక్రియ సందర్భంగా ప్రాథమిక పరీక్ష నిర్వహించారన్నారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆదేశాల మేరకు రిజర్వేషన్ అభ్యర్థులకు కేటాయిస్తున్నట్లే జనరల్ అభ్యర్థులతో పాటు తమకు కూడా వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

రుయా, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రుల్లో

సదుపాయాలు, సిబ్బంది కొరత

- రోగులకు తప్పని తిప్పలు

తిరుపతి(వైద్యం), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా నలుమూలల నుంచి వైద్యం కోసం నిత్యం వందల సంఖ్యలో రోగులు రుయా, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రులకు వస్తుంటారు. ఇక్కడ వైద్యం అందాలంటే రోగులపాటు వారికి తోడుగా వచ్చిన సహాయకులకు ఆపసోపాలు తప్పడం లేదు. సరైన సదుపాయాలు, సిబ్బందిని నియమించకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కనీసం వారికి సహాయంగా ఉండాల్సిన సిబ్బంది కూడా అందుబాటులో లేకపోవడంతో అయినవారే వీల్‌చైర్లలో, స్ట్రెచర్‌లపై అతి కష్టం మీద నెట్టుకుంటూ తీసుకెళ్లాల్సి వస్తుంది. మరికొందరికి ఆ వీల్‌చైర్లు కూడా అందుబాటులో లేక చేతులపై ఎత్తుకొని వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. రుయాలో పరిస్థితి ఇలా ఉంటే ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి వైద్యం కోసం వచ్చిన గర్భిణులు లోపల ఉంటే వారికి సాయంగా వచ్చిన వారు బయట అవస్థల నడుమ ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. రోగులను దూరంగా ఉన్న సహాయకుల భవనంలోకి తీసుకెళ్లాలంటే అయిన వారు ఆస్పత్రి ముందే పడిగాపులు కాయాల్సి వస్తుంది. దీనికితోడు ఆస్పత్రి ముందే డంపింగ్ యార్డును తలపించేలా చెప్పులు వదిలేసి ఉన్నా పట్టించుకునే వారు లేరు. వీటిపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



రోగిని ఆక్సిజన్‌తోపాటు స్ట్రెచర్‌పై తీసుకువెళుతున్న సహాయకులు - ముందు వీల్స్ లేని వీల్‌చైర్‌లో రోగిని తీసుకువెళుతున్న సహాయకులు - కాలికి గాయంతో ఉన్న బాలికను ఎత్తుకొని వెళుతున్న తండ్రి



ప్రసూతి ఆస్పత్రి ముందు కుప్పలుగా పడివున్న రోగుల, సహాయకుల చెప్పులు - సీటి స్కాన్‌కు వెళ్లే కేంద్రం ముందు నిలిచి ఉన్న మురుగు నీరు

ధోబీఘాట్‌లో సౌకర్యాలు కల్పిస్తాం

- శ్మశాన వాటికలో ఈ చెత్తా చెదారమేంటి?
- కమిషనర్ ఎన్.మౌర్య అసహనం



ధోబీఘాట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, మార్చి11(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్మశాన వాటికలను పరిశుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. స్థానిక 33వ వార్డులోని హరిశ్చంద్ర శ్మశాన వాటిక, ధోబీఘాట్, సుందరయ్య నగర్, స్కావెంజర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో మంగళవారం హెల్త్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలసి కమిషనర్ పారిశుధ్య పనులను పరిశీలించారు. శ్మశానం చుట్టుపక్కల ప్రాంతాల్లో చెత్త చెదారం ఉండడం పట్ల కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. శ్మశానంలో నెలకొని ఉన్న సమస్యలను ప్రజలు కమిషనర్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మౌర్య మాట్లాడుతూ శ్మశాన వాటికలను, ధోబీఘాట్‌ను శుభ్రంగా ఉంచాలని అన్నారు. శ్మశాన వాటికలో కర్మక్రియలకు వచ్చే వారికి కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. సుందరయ్య నగర్, రైల్వే కాలనీ, స్కావెంజర్స్ కాలనీలో ప్రజలకు కావాల్సిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. మురుగునీటి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, తుడా ఈఈ రవీంద్ర, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీఈలు రమణ, రాజు, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, ఏసీపీ మూర్తి, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య, సుమతి ఉన్నారు.

ఎన్నికల ప్రక్రియలో

అపరిష్కృత అంశాలపై ఫిర్యాదుచేయండి

- రాజకీయ పార్టీ నేతలకు ఎన్నికల కమిషన్ సూచన

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక, ఉప ఎన్నికల్లో అపరిష్కృతంగా ఉన్న అంశాలపై రాజకీయ పార్టీ నాయకులు ఏప్రిల్ 30వ తేదీ లోపు ఫిర్యాదుచేయవచ్చని భారత ఎన్నికల సంఘం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఎన్నికల ప్రక్రియ నిర్వహణను బలోపేతం చేసి పారదర్శకంగా నిర్వహించేందుకు అపరిష్కృతంగా ఉన్న పలు అంశాలను గుర్తింపు పొందిన రాష్ట్ర, జాతీయ పార్టీ ప్రతినిధులకు సూచించింది. ఈఆర్వో, జిల్లా ఎన్నికల అధికారి వద్ద ఫిర్యాదు చేసినా పరిష్కారం కాని అంశాలపై ఏప్రిల్ 30లోపు ఫిర్యాదుచేయాలని ఎన్నికల సంఘం సూచించింది.

యువత పోరు జగన్

ఇంటి ముందు చేయండి: టీఎన్ఎస్ఎఫ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ చేపట్టిన యువత పోరును జగన్ ఇంటి ముందు చేపట్టాలని టీఎన్ఎస్ఎఫ్ నేత హేమంత్‌రాయల్ సూచించారు. వైసీపీ పాలనలో స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్స్ సకాలంలో చెల్లించలేదన్నారు. ఐదేళ్లలో గుర్తురాని ఫీజులు నేడు వైసీపీ నాయకులకు గుర్తురావడం ఆశ్చర్యంగా ఉందన్నారు. 2014-19లో టీడీపీ ప్రభుత్వం సకాలంలో ఫీజులు నేరుగా కాలేజీలకు చెల్లించిందని, కూటమి ప్రభుత్వం రూ.780కోట్ల నిధులు విడుదలచేసిందనిచెప్పారు. జీవో77తో ఉన్నత విద్యకు వైసీపీ ప్రభుత్వం పేదలను దూరం చేసిందని, యువత పోరుతో విద్యార్థులను వైసీపీ మోసం చేస్తోందని ఆయన తెలిపారు.

పోటాపోటీగా టీటీడీ ఉద్యోగుల క్రీడలు



క్యారమ్స్ ఆడుతున్న టీటీడీ ఉద్యోగినులు

తిరుపతి(క్రీడలు), మార్చి 11(ఆంధ్రజ్యోతి): టీటీడీ వార్షిక క్రీడలు మంగళవారం పోటాపోటీగా జరిగాయి. క్యారమ్స్ సింగిల్స్‌లో కుసుమకుమారిపై డాక్టర్ సుహర్‌లత గెలుపొందగా, డబుల్స్‌లో కుసుమకుమారి, నీలిమలపై డాక్టర్ సుహర్‌లత, దామరసెల్వి విజయం సాధించారు. టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో ఆంజనేయులుపై కిరణ్‌కుమార్‌రాజు, డబుల్స్‌లో కిరణ్‌కుమార్‌రాజు, కృష్ణమూర్తిలపై మురళి, ఆంజనేయులు గెలుపొందారు. షటిల్ సింగిల్స్‌లో పద్మపై స్వప్నమంజరి, మహాలక్ష్మిపై శ్రీలక్ష్మి విజయం సాధించారు. డబుల్స్‌లో మహాలక్ష్మి, శ్రీలక్ష్మిలపై భవ్య, లహరి విజేతగా నిలిచారు.

విలువైన సమయాన్ని సమ్మె పేరిట వృథా చేస్తున్నారు

- తరగతులకు హాజరయ్యేలా కౌన్సెలింగ్ ఇవ్వండి
- విద్యార్థుల తల్లిదండ్రులతో వెటర్నరీ ఇన్‌చార్జి జేవీ రమణ



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ జేవీ రమణ

తిరుపతి రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులకు ప్రతిరోజూ చాలా విలువైందని, మీపిల్లలు 37రోజులుగా తరగతులను బహిష్కరించి సమ్మెపేరుతో విలువైన సమయాన్ని కోల్పోయారని.. వారికి సరైన కౌన్సెలింగ్ ఇచ్చి తరగతులకు హాజరయ్యేలా చూడాలని ఎస్వీవెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ జేవీ రమణ విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. వైద్య విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ పెంచాలని విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం దీక్షాశిబిరం వద్దకు వచ్చి తమ పిల్లలకు సంఘీభావం తెలిపి, బైఠాయించి మద్దతు ప్రకటించారు. అనంతరం వర్సిటీ పరిపాలనా భవనానికి చేరుకుని వీసీతో మాట్లాడారు. నెలరోజులకుపైగా విద్యార్థులు సమ్మె చేస్తున్నా పట్టించుకోకపోడమేమిటని, ప్రభుత్వం దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదని వీసీని అడిగారు. దీనిపై స్పందించిన వీసీ మాట్లాడుతూ.. స్టైఫండ్ పెంపు వర్సిటీపరిధిలో లేదని, దీనిపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని వివరించారు. సమ్మె విరమించి తరగతులకు హాజరయ్యేలా పిల్లలకు వివరించాలని కోరారు. అంతకుముందు తల్లిదండ్రులతో మాట్లాడేందుకు ప్రొఫెసర్ డాక్టర్ గంగరాజు ప్రయత్నించారు. అయితే విద్యార్థుల తల్లిదండ్రులు తాము వీసీతోనే మాట్లాడుతామని చెప్పగా ఆయన మిన్నకుండిపోయారు. కాగా వర్సిటీ ప్రధానగేటు ఎదురుగా ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో విద్యార్థులు బైఠాయించి సమ్మెని కొనసాగించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తుల హడావుడిలో పాప మిస్

● పోలీసుల అప్రమత్తతతో క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు
● తిరుమలలో సంఘటన


దివ్యను రవికి అప్పగిస్తున్న పోలీసులు

తిరుమల నుంచి తిరిగి వెళ్లే హడావుడిలో ఐదేళ్ల చిన్నారిని ఒక కుటుంబం వదిలేసి వెళ్లిపోయింది. పోలీసుల అప్రమత్తతో ఆ పాప క్షేమంగా తల్లిదండ్రుల వద్దకు చేరింది. మంగళవారం ఈ సంఘటన జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లాలోని హన్వాడకు చెందిన రవి, వెంకటేశ్వరి దంపతులు పదిమంది కుటుంబ సభ్యులతో సోమవారం తిరుమలకు వచ్చారు. దర్శనం చేసుకుని మంగళవారం ఉదయం తిరుపతికి బయలుదేరారు. ఈ హడావుడిలో తమ చిన్నారి దివ్య తమతో లేదనే విషయం గుర్తించకుండానే తిరుపతికి చేరుకున్నారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండులో పాప లేదని గుర్తించి ఆందోళనపడ్డారు. వెంటనే అక్కడ ఉన్న పోలీసు ఔట్‌పోస్టులో ఫిర్యాదు చేశారు. వారు వెంటనే తిరుమలకు సమాచారం ఇచ్చారు. తిరుమలలోని యాత్రికుల వసతి సముదాయం 3 వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా చిన్నారి కనిపించింది. సమాచారం తెలిసి తిరుమలకు వెళ్లిన దివ్య తండ్రి రవికి పాపను అప్పగించారు. సీఐ శ్రీరాముడు, సిబ్బందికి భక్తుడు ధన్యవాదాలు తెలిపారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

త్వరలో నా రెండో సినిమా

● 'బలగం' వేణు



వకుళాభరణం కృష్ణమోహన్ రావు

'బలగం' చిత్రంతో మంచి హిట్ కొట్టిన నటుడు, దర్శకుడు వేణు మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. త్వరలో తన రెండవ సినిమా దిల్‌రాజ్ బ్యానర్‌లో ప్రారంభం కానుందని చెప్పారు. ఈక్రమంలో స్వామి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చానని తెలిపారు. కాగా, అంతకుముందు తెలంగాణ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 28 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.27 కోట్లు
సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 69,746
తలనీలాలు సమర్పించినవారు: 23,649

క్రీడల్లో రాణించి.. ఉద్యోగం సాధించి..

నెరవేరిన పేదింటి క్రీడాకారుడి కల




డీఆర్ఎం చేతుల మీదుగా మెడల్, సర్టిఫికెట్ అందుకుంటున్న కార్తీక్

బాల్‌బాడ్మింటన్‌లో విశేష ప్రతిభతో ఓ యువకుడు తన కలను సాకారం చేసుకున్నాడు. రైల్వేలో ఉద్యోగం సాధించి కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలిచాడు. ఉద్యోగంలో చేరినా క్రీడాపరంపర కొనసాగిస్తున్నాడు. తిరుపతి రూరల్ మండలం కూపచంద్రపేటకు చెందిన పొన్న కార్తీక్ రెక్కాడితే డొక్కాడని కుటుంబంలో పుట్టాడు. తండ్రి లోకనాథం రేణిగుంటలో టింబర్‌డిపోలో పనిచేస్తాడు. తల్లి లత గృహిణి. గ్రామానికి సమీపంలోనే దుర్గసముంద్రం హైస్కూల్లో కార్తీక్ చదువుకున్నాడు. అక్కడి మైదానంలోనే రోజూ స్నేహితులతో ఆడేవాడు. ముఖ్యంగా బాల్‌బాడ్మింటన్ మక్కువ చూపేవాడు. తొలినాళ్ల నుంచి ప్రభుత్వ ఉద్యోగం పొంది తల్లిదండ్రుల కష్టాలను తీర్చాలనేది కార్తీక్ బలమైన సంకల్పం. క్రీడల్లో బాగా రాణిస్తే స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగం వస్తుందని తెలుసుకున్నాడు. పట్టుదలతో కష్టపడ్డాడు. పీలేరులో జిల్లా సెలక్షన్స్‌లో ఎంపికై క్రీడా ప్రస్థానానికి శ్రీకారం చుట్టాడు. తరువాత వెనుతిరిగి చూడలేదు. విజయ పరంపర కొనసాగించాడు. రాష్ట్ర, జాతీయస్థాయిలో పలు పతకాలను కైవసం చేసుకున్నాడు. 2018లో స్పోర్ట్స్ కోటా ఆధారంగా రైల్వేలో ఉద్యోగం పొందాడు. ప్రస్తుతం విశాఖపట్నంలోని సీనియర్ కమర్షియల్ కమ్ టికెట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు స్పోర్ట్స్ కోటాకింద రైల్వేలో ఉద్యోగం పొందిన ముగ్గురిలో కార్తీక్ కూడా ఒకడు. - తిరుపతి(క్రీడలు), ఆంధ్రజ్యోతి


గతేడాది రైల్వే టోర్నీలో విన్నర్ ట్రోఫీ అందుకుంటున్న కార్తీక్

ఇప్పటికీ ఆడుతున్నాను

ఉద్యోగం వచ్చినా తనకు ఉపాధి చూపిన క్రీడను మర్చిపోలేదు. ఎక్కడ పోటీలు జరిగినా పాల్గొంటున్నాను. అమ్మానాన్నల శ్రమ, అన్న రంజిత్, పీఈటీ టీచర్, బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధుల ప్రోత్సాహం నాకు తోడైంది. యువకులు కష్టపడి ఆడితే ఉద్యోగంతో పాటు క్రీడాకారుడిగా గుర్తింపు కూడా వస్తుందని గుర్తించాలి.
- పొన్న కార్తీక్

భార్యపై భర్త హత్యాయత్నం

● నిందితుడి అరెస్ట్


నిందితుడు హేమకుమార్


గాయపడిన లక్ష్మీప్రియ

పెళ్లకూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న దంపతుల మధ్య అనుమానం పెనుభూతమై మనస్పర్థలు రేపింది. చివరకు భార్యపై భర్త హత్యాయత్నానికి పాల్పడిన ఘటన పెళ్లకూరు మండలంలో జరిగింది. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు సమీపంలోని గుంటకింద పల్లె గ్రామానికి చెందిన హేమకుమార్, అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరుకు చెందిన పంతగాని లక్ష్మీప్రియ ఒకరినొకరు ప్రేమించుకున్నారు. పెద్దల అంగీకారంతో నాలుగేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నారు. వివాహమైన కొద్ది నెలల నుంచే హేమకుమార్ భార్యపై అనుమానంతో తరచూ గొడవ పడేవాడు. ఇలా ఉండగానే వీరికి ఓ బిడ్డ జన్మించింది. తరువాత కూడా భర్త ప్రవర్తనలో మార్పు రాకపోయేసరికి లక్ష్మీప్రియ తల్లిదండ్రుల వద్దకు వెళ్లిపోయింది. కొన్నాళ్ల తరువాత మళ్లీ కలుసుకున్న వీరు శ్రీకాళహస్తిలో కాపురం పెట్టారు. ఆదివారం మధ్యాహ్నం లక్ష్మీప్రియను బైక్‌పై ఎక్కించుకున్న హేమకుమార్ పెళ్లకూరు మండలంలో టెంకాయతోపు సమీపంలోని పంటకాలువ వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ ఇద్దరి మధ్య తీవ్ర స్థాయిలో గొడవ జరిగింది. ఈ క్రమంలో తన వెంట తెచ్చుకున్న కత్తి, స్క్రూడ్రైవర్‌తో లక్ష్మీప్రియపై హేమకుమార్ దాడి చేశాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో అటుగా వెళ్తున్న యువకులు గమనించి హేమకుమార్‌ను అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. తొటంబేడు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని లక్ష్మీప్రియను శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పారిపోయేందుకు ప్రయత్నించిన హేమకుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఘటన జరిగిన ప్రదేశం పెళ్లకూరు మండల పరిధిలోకి రావడంతో కేసును మంగళవారం ఆ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. నిందితుడిపై కేసు చేసి కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.

స్విమ్స్‌లో 12 ఏళ్ల బాలికకు అతి క్లిష్టమైన సర్జరీ


చికిత్స అనంతరం కోలుకున్న బాలికతో వైద్యులు

తిరుపతి(వైద్యం), మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఊపిరి తిత్తుల సమస్యతో స్విమ్స్‌కు వచ్చిన 12 ఏళ్ల బాలికకు అతి క్లిష్టమైన సర్జరీ చేసి ప్రాణాలు నిలబెట్టామని మెడికల్ సూపరింటెండెంట్ రామ్ మంగళవారం తెలిపారు. గుంటూరు జిల్లా మాచర్ల నగరానికి చెందిన సైదాబీ(12) అనే బాలిక ఊపిరి తిత్తుల సమస్యతో బాధపడుతుంటే కుటుంబ సభ్యులు స్విమ్స్‌కు తీసుకువచ్చారు. ఇక్కడ వైద్యులు పరీక్షించగా బాలిక ఊపిరి తిత్తులు, గుండెకు మధ్యలో పెద్ద గడ్డ ఉన్నట్లు గుర్తించారు. వెంటనే సీటీ సర్జరీ విభాగం ఆధ్వర్యంలో గత నెల 25న బాలికకు అతి క్లిష్టమైన సర్జరీ చేసి ఆ గడ్డను తొలగించారు. ప్రస్తుతం బాలిక పూర్తి ఆరోగ్యంగా కోలుకోవడంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. సాధారణంగా ఆ సర్జరీకి దాదాపు రూ.5 లక్షల వరకు ఖర్చవుతుందని, స్విమ్స్‌లోని టీటీడీ ప్రాణదాన పథకంలో పూర్తి ఉచితంగా బాలికకు శస్త్ర చికిత్స అందించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య విభాగాధిపతులు అలోక్ సమంత్రే, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



కారు దహనం.. ప్రయాణికులు సురక్షితం

పాకాల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పదిపుట్లబైలు సమీపంలో మంగళవారం తెల్లవారుజామున కారులో మంటలు చెలరేగాయి. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. తిరుపతి వైపు నుంచి కొమ్మిరెడ్డిగారిపల్లె మీదుగా మదనపల్లెకు వెళ్తున్న కారులో అకస్మాత్తుగా మంటలు వచ్చాయి. కారులోని వారు దిగి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. పాకాల అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలు ఆర్పారు. అగ్నిమాపక సిబ్బంది మనోహర్‌రెడ్డి, సురేంద్రబాబు, బాలాజీ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

18వరకు ఈకేవైసీ నమోదు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), మార్చి 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో రబీ సీజనుకు సంబంధించి ఈ-పంట నమోదు కోసం ఈకేవైసీని రైతులు ఈ నెల 18వ తేదీలోపు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో రబీ 2024-25కుగాను 2,03,860 ఎకరాలకు సంబంధించి 72,966మంది రైతులు ఈ-పంట యాప్‌లో నమోదు చేయాల్సి ఉండగా 1,94,805 ఎకరాలకు గాను 69,228మంది రైతులు ఈకేవైసీ చేసుకున్నారని వివరించారు. ఇంకా చేసుకోని రైతులు రైతు సేవా కేంద్రాల్లో ఈ నెల 18వ తేదీలోపు చేసుకోవాలని తెలిపారు. నమోదు చేసుకున్న రైతుల జాబితాను రైతు సేవా కేంద్రాల్లో 14వ తేదీ వరకు ప్రదర్శించి గ్రామసభల ద్వారా రైతుల వివరాలను చదివి వినిపిస్తారని తెలియజేశారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే 19వ తేదీలోపు రాతపూర్వకంగా తెలియజేస్తే సరిచేసి 22వ తేదీ తుది జాబితాను తయారుచేస్తారని వివరించారు.

ఎర్రచందనం స్వాధీనం: ఇద్దరు స్మగ్లర్ల అరెస్ట్

తిరుపతి, మంగళం, మార్చి 11: భాకరాపేట అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు రూ.40 లక్షల విలువచేసే 32 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. వారి నుంచి ఓలగేజ్ వాహనాన్ని, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ హెడ్ ఎల్.సుబ్బారాయుడు కథనం మేరకు.. ఆర్ఐ సాయిగిరిధర్‌కు చెందిన బృందంలోని ఆర్ఎస్ఐ కేఎస్ కే.లింగాధర్ స్థానిక ఎఫ్‌బీవో రాజేశ్‌కుమార్‌తో కలసి మంగళవారం తెల్లవారుజామున దేవరకొండ అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. తుమ్మచేనుపల్లి మట్టి రోడ్డు వద్ద మోటార్ సైకిల్‌పై ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. అతడి వాహనాన్ని వెంబడించగా ఒక లగేజి వాహనం కనిపించింది. ఆ వాహనాన్ని చుట్టుముట్టగా అందులోని స్మగ్లర్లు పారిపోయే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని వెంబడించి ఇద్దరు స్మగ్లర్లను పట్టుకోగలిగారు. లగేజి వాహనంలో ఉన్న 32 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన వారుగా గుర్తించారు. ఎర్రచందనం దుంగలతో సహా వారిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


పట్టుబడ్డ ఎర్రచందనంతో సహా స్మగ్లర్లను అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

హోటల్ గదిలో కూలిన పీవోపీ

● అర్ధరాత్రి పరుగులు తీసిన భక్తులు


మినర్వా గ్రాండ్ హోటల్‌లో పెచ్చులూడిన వైనం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 11(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని మినర్వా గ్రాండ్ హోటల్‌లో సోమవారం అర్ధరాత్రి తర్వాత స్లాబుకున్న పీవోపీ ఊడి పడింది. దీంతో గదిలో ఉన్న భక్తులు భయాందోళనతో కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశారు. ఈస్ట్ సీఐ రామకృష్ణ తెలిపిన ప్రకారం.. తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో ఉన్న ఐదుగురు భక్తులు మినర్వా గ్రాండ్ హోటల్‌లోని ఓ గదిని తీసుకున్నారు. వీరంతా గాఢనిద్రలో ఉండగా రూములోని పైకప్పునకు ఉన్న పీవోపీ ఊడి కింద పడింది. దీంతో పెద్ద శబ్దం రావడంతో భయంతో పరుగులు తీశారు. వెంటనే సీఐ రామకృష్ణ, ఎస్‌ఐలు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. ముందు జాగ్రత్తగా అన్ని గదుల్లోని వారిని బయటకు పంపి వివిధ హోటళ్లలో అకామడేషన్ ఏర్పాటు చేశారు. హోటల్‌కు తాళం వేసి అన్ని శాఖల నుంచి అనుమతులు తీసుకుని.. హోటల్‌ను తెరిచేలా పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. అన్ని హోటళ్లలో భద్రతా ప్రమాణాలపై తనిఖీలు చేయడానికి మున్సిపల్, పోలీసు, అగ్నిమాపక అధికారులు సిద్ధమయ్యారు.

హోటల్ యాజమాన్యంపై కేసు

'హోటల్ గదిలో పీవోపీ పెచ్చులూడిన ఘటనలో మా అక్క చిన్ని చిల్లకుర్తి (66), తల్లి ప్రేమలత రామయ్య (85)కు గాయాలయ్యాయి. అమెరికాలోని చికాగోలో ఉంటున్న వీరు శ్రీవారి దర్శనానికి వచ్చారు. గాయపడిన ఇద్దరూ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు' అంటూ అమెరికాలో నివాసం ఉంటున్న రాణి ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హోటల్ యాజమాన్యంపై ఈస్ట్ సీఐ కేసు నమోదు చేశారు.

పారదర్శకంగా ఉచిత ఇసుక

● అందుబాటులో 1,37,686 టన్నులు ● అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రజలకు పారదర్శకంగా ఇసుక ఉచితంగా అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లాలో మూడు డిసిల్టేషన్ పాయింట్ల నుంచి సుమారు 1,37,686 టన్నుల ఇసుక ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. తిరుపతి ప్రజలకు మూడు స్టాక్ పాయింట్లను ఉచిత విధానంలో ఇసుక సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.ఈ స్టాక్ పాయింట్లకు అన్నమయ్య జిల్లాలోని రీచ్‌ల నుంచి ఇసుక తీసుకొస్తున్నట్లు వివరించారు. జిల్లాలో గుర్తించిన మూడు డిసిల్టేషన్ పాయింట్లలో రెండు పెళ్లకూరు మండలం, మరొకటి కోట మండలం గూడలిలో ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయన్నారు. ఈ నెల 15వ తేదీ లోపు ఇసుక సరఫరాను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ పాయింట్ల వద్ద ఇసుక తవ్వడానికి, రవాణాకు ఏజెన్సీని నియమించామని, వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ లేదా నేరుగా వెళ్లి ఇసుక కమిటీ నిర్ధారించిన నామమాత్రపు రుసుం చెల్లించి తీసుకెళ్లవచ్చన్నారు. ఇసుక డిసిల్టేషన్ పాయింట్లను సంబంధిత ఆర్డీవోలు తనిఖీ చేయాలన్నారు. ఎస్పీ హర్షవర్ధనరాజు మాట్లాడుతూ.. అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితిలో ఉపేక్షించేది లేదన్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6వరకు ఇసుక తవ్వకాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో గుడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, జిల్లా గనులశాఖ అధికారి బాలాజీ నాయక్, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం ఎంతో బాగుంది


విద్యార్థుల యూనిఫాంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం కొత్తగా రూపొందించిన యూనిఫాం ఎంతో బాగుందని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఈ కొత్త యూనిఫాం అమల్లోకి రానుందన్నారు. అమరావతిలోని విద్యాశాఖ మంత్రి లోకేశ్ కార్యాలయంలో ఈ యూనిఫాంను బొజ్జల మంగళవారం పరిశీలించారు.ఎలాంటి రాజకీయ గుర్తులు లేకుండా యూనిఫాం ఉండటం కూటమి పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు.

సెలవుపై జాయింట్ కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ వ్యక్తిగత పనుల నిమిత్తం ఈ నెల 16వ తేదీ వరకు సెలవుపై వెళ్లారు. ఆయన స్వగ్రామమైన ఉత్తరాఖాండ్ నైనిటాల్‌కు వెళ్లారు. తిరిగి 17నుంచి విధులకు హాజరు కానున్నట్లు అధికారులు తెలిపారు.

పీ4 సర్వేపై గ్రామసభలు నిర్వహించండి

● కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న పీ4 సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామసభలు నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి వివిధ అంశాలపై డీఆర్వో నరసింహులతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ సున్నా పేదరికం లక్ష్యంగా నిర్వహిస్తున్న పీ4సర్వేలో భాగంగా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు వెనుకబడిన ప్రాంతాల్లో గ్రామ, వార్డు సభలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను పెండింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను శనివారంలోపు పూర్తిగా నిలిపివేయాలని, ఎవరూ వినియోగించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఈ సర్వే, వర్క్‌ఫ్రం హోమ్ సర్వేను 15వ తేదీ లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీపీవో సుశీలాదేవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోష్మాండ్, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, డ్వామా పీడీ శ్రీనివాస్‌ప్రసాద్, డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

హైవేలో రాంగ్ రూట్ ప్రయాణం

● 107 వాహనాలు స్వాధీనం



తిరుపతి(నేరవిభాగం), మార్చి 11(ఆంధ్రజ్యోతి): పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలో గత కొంత కాలంగా హైవేపై రాంగ్ రూట్‌లో వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నట్లు గుర్తించిన పోలీసులు మంగళవారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ డీఎస్పీ రామకృష్ణమాచ్చారి, సీఐ చిన్నగోవిందు, ఎస్‌ఐలు షేక్ షావలి, రామకృష్ణ, సిబ్బంది కలిసి తనిఖీల్లో పాల్గొన్నారు. రాంగ్ రూట్‌లో, ఆపోజిట్ డైరెక్షన్‌లో వాహనాలు నడిపిన దాదాపు 107 వాహనాలను తనిఖీ చేసి కేసులు నమోదు చేసి స్వాధీనం చేసుకున్నారు. ఇందులో ద్విచక్ర వాహనాలు, కార్లు, ఎక్స్‌కవేటర్లు, ట్రాక్టర్లు ఉన్నాయి. ఇప్పటి వరకు 27 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచగా న్యాయమూర్తి వారికి రూ 1.85 లక్షలు జరిమానా విధించినట్లు సీఐ చెప్పారు.

సీపీఐ నారాయణ హెచ్చరికతో మద్యం షాపు తరలింపు

స్పందించి ఆరా తీసిన కలెక్టర్... షాపు తరలించాలని ఆదేశం

తిరుపతి/తిరుపతి(నేరవిభాగం), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం అవిలాల సాయినగర్ పంచాయతీలో ఇళ్ళ మధ్య మద్యం షాపు ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంపై సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ చేసిన హెచ్చరికతో మద్యం షాపును అధికారులు మరోచోటకు తరలించేలా చర్యలు తీసుకున్నారు. నారాయణ ప్రకటన నేపథ్యంలో స్పందించిన కలెక్టర్ వెంకటేశ్వర్ ఆరా తీసి సమస్య పరిష్కారానికి ఆదేశాలిచ్చారు. దీనికి సంబంధించిన వివరాలిలా వున్నాయి. జిల్లావ్యాప్తంగా కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం 23 మద్యం షాపులు కేటాయించిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా తిరుపతి రూరల్ మండలంలో సీరియల్ నంబరు 20వ షాపును దక్కించుకున్న వ్యక్తులు అవిలాల సాయినగర్ పంచాయతీలో ఫ్రెండ్లీ వైన్స్ పేరిట ఏర్పాటు చేశారు. అయితే షాపు జనావాసాల నడుమ వున్నందున అక్కడి నుంచీ తొలగించాలని కొద్ది రోజులుగా స్థానిక మహిళలు ఆందోళన చేస్తున్నారు. వారికి సీపీఐ నేతలు మద్దతుగా రంగంలోకి దిగారు. ఇటీవల షాపు బ్యానర్లను సైతం తగలబెట్టారు. ఈ నేపథ్యంలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మంగళవారం తిరుపతి వచ్చారు. మద్యం షాపు వివాదం గురించి తెలుసుకుని బుధవారం నుంచీ అక్కడే బైఠాయిస్తామని, తొలగించే వరకూ ఆందోళన విరమించేది లేదంటూ హెచ్చరించారు. ఆ సందర్భంగా ఎక్సైజ్ అధికారులు కలెక్టర్‌కు తప్పుడు సమాచారం ఇచ్చి తప్పుదోవ పట్టిస్తున్నారంటూ ఆరోపించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంకటేశ్వర్ విషయం ఏమిటని ఆరా తీశారు. ఇళ్ళ మధ్య వైన్ షాపు వద్దని, స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నపుడు షాపును అక్కడ నుంచీ మరో చోటకు తరలించాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. కాగా, సాయినగర్‌లో ఏర్పాటు చేయదలచిన గీత కార్మికుడి ఫ్రెండ్లీ వైన్స్ మద్యం షాపు స్థానిక ప్రజలు, వామపక్ష పార్టీల ఆందోళన నేపథ్యంలో అక్కడ ఏర్పాటు చేయదలచిన దుకాణాన్ని వేరొక చోట ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గీత కార్మికుల కోసం దాదాపు 23 దుకాణాలు కేటాయించామన్నారు. అయితే ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాలేదని సాయినగర్‌లో ప్రజల విజ్ఞప్తి మేరకు అక్కడ నుంచి వేరొక చోట ఏర్పాటు చేసుకునేలా దుకాణం నిర్వాహకుడికి నోటీసులు జారీ చేశామన్నారు. ఈ విషయాన్ని స్థానిక ప్రజలు గమనించాలని కోరారు.

పుత్తూరు వార్తలు

ఆక్రమణ చెరలో కాళాస్త్రిగుంట?



పుత్తూరు అర్బన్, మార్చి11(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని కల్యాణపురంలో ఉన్న కాళాస్త్రి గుంట ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. సర్వే నెం.82లో 7.16 ఎకరాల్లో కాళాస్త్రి గుంట ఉంది. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ నెం.1142/2012లో సర్వే నెం.88-10, 15బి, 17బిలలో 111.11 చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేసిన లక్ష్మయ్య ఇంటి నిర్మాణానికి పూనుకున్నాడు. కాగా, రిజిస్ట్రేషన్ చేసుకున్న సర్వే నెంబర్‌కు, ఇంటి నిర్మాణం చేపడుతున్న సర్వే నెంబర్‌కు సంబంధం లేదు. దీనిపై వీఆర్వోను ఆంధ్రజ్యోతి ప్రతినిధి వివరణ కోరగా... తాను బాధ్యతలు తీసుకుని మూడు నెలలే అయ్యిందని, సర్వే చేస్తే కానీ ఆక్రమించారా లేదా అనేది తెలియదని సమాధానం చెబుతున్నారు. అంతే కాకుండా పట్టణ ప్రణాళిక విభాగం అధికారి నీరజాక్షిని వివరణ కోరగా... ఆక్రమణలు బఫర్ జోన్‌లో ఉన్నాయని, వాటికి ఎటువంటి అనుమతులు లేవని చెబుతున్నారు. ఏది ఏమైనా చెరువులు, కుంటలు, కాలువలు ఆక్రమణలకు గురికాకుండా చూసుకోవాల్సిన బాధ్యత రెవెన్యూ, మున్సిపల్ అధికారులపై ఉంది.

రేపు పుత్తూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

- 2025-26కు మున్సిపల్ పరిపాలనా ఖర్చులు రూ.17.28 కోట్లు
- నీటి పంపింగ్, వీధిలైట్ల విద్యుత్ ఛార్జీలకు రూ.4.50 కోట్లు
- టెండర్ల ఆమోదానికి ప్రతిపాదనలు
- అజెండాలో అభివృద్ధి పనుల తొలగింపు

పుత్తూరు అర్బన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో ఆధిపత్యపోరు కొనసాగుతోంది. ఛైర్మన్ ఆమోదించిన అజెండాను అధికార పార్టీ కౌన్సిలర్లు ప్రశ్నించడంతో కౌన్సిల్ సమావేశం వాయిదా పడిన విషయం విదితమే. తమ వార్డుల్లో అభివృద్ధి పనులను అజెండాలో పొందపరచకుండా వేరొకరి ప్రాంతంలో పనులకు పొందపరిచారని ఛైర్మన్‌ను ప్రశ్నించారు. చివరకు ఎటువంటి అభివృద్ధి పనులకు అవకాశం లేకుండా టెండర్లు ఆమోదించేందుకు సిద్ధమయ్యారు. ఈమేరకు ఈనెల 12న బుధవారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించాల్సి ఉండగా పార్టీ కార్యక్రమాన్ని సాకుగా చూపి వాయిదా వేశారు. ఈనెల 13న గురువారం కౌన్సిల్ సమావేశం కానుంది. 2025-26 ఏడాదికి పరిపాలన సౌలభ్యం కోసం వివిధ విభాగాల నిర్వహణ నిమిత్తం రూ.17.28 కోట్లు ఖర్చు చేసేందుకు అజెండాలో పొందుపరిచారు. ఇందులో నీటి పంపింగ్, వీధి లైట్లు, కార్యాలయం, సచివాలయాలకు సంబంధించి విద్యుత్ ఛార్జీలకు రూ.4.50 కోట్లు ఆమోదానికి ఉంచారు. అంటే నెలకు మున్సిపాలిటీ రూ.37.50 లక్షల విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నారు. మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్ల గౌరవ వేతనం, రవాణా భత్యం కింద రూ.16 లక్షలు, కౌన్సిల్, ఇతర సమావేశాలకు రూ.10 లక్షలను కేటాయించారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని చేపట్టాల్సిన పనులకు కూడా కౌన్సిలర్ల నడుమ పోటీతో రద్దు చేయడాన్ని ప్రశ్నించనున్నట్లు తెలుస్తోంది.

వడమాలపేటలో వర్షం



వడమాలపేట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కొన్ని రోజులుగా ఎండ వేడిమికి ఉపశమనంగా మంగళవారం సాయంత్రం వడమాల పేట పరిసర ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. అయితే పూత నిండుగా ఉండడం, మంచుకు తోడు వర్షంతో మామిడి రైతులు ఆందోళన చెందారు. ఈ పరిస్థితుల్లో చిన్నపాటి వర్షం పడినా పూతలు మగ్గిపయి రాలిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాస్తంత ఉపశమనం మామిడి రైతులకు శాపంగా మారుతోంది.

వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు

పుత్తూరు టౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రైతులు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేసుకోవాలని పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య సూచించారు. మంగళవారం పుత్తూరు మార్కెట్ యార్డులో పుత్తూరు, వడమాలపేట, నారాయణవనం మండలాల మామిడి రైతులకు ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యానవన అధికారుల సూచనల మేరకు కొత్త రకం పంటలను సాగు చేయాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త రంజిత్‌కుమార్ మాట్లాడుతూ... అధిక మోతాదులో రసాయన మందులు, ఎరువులు వినియోగించడం వల్ల మామిడిలో చీడపీడలు అధికమై దిగుబడి తగ్గిపోతోందన్నారు. నిమ్మ, దానిమ్మ, పామోలిన్, డ్రాగన్ ఫ్రూట్ వంటి ఇతర పంటలు సాగుచేస్తే అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, జిల్లా సూక్ష్మ సేద్య ఏపీవో సంతోష్‌కుమార్, పుత్తూరు ఏడీ రమేష్‌రాజు, పుత్తూరు, వడమాలపేట, నారాయణవనం ఏవోలు కోదండయ్య, విజయ్‌కుమార్, శోభారాణి, పుత్తూరు ఉద్యానవన శాఖాధికారి సౌజన్య పాల్గొన్నారు.

కామధేనువుపై దేవేరులతో స్కందుడు

పుత్తూరు టౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తిరుపతి రోడ్డులో కొలువై ఉన్న వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి స్వామి ఆలయ 53వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి దేవేరులతో స్వామివారు కామధేనువుపై విహరించారు. అంతకుముందు ఉదయం స్వామిఅమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి కామధేనువుపై దేవేరులతో అధిష్ఠించి పట్టణంలో విహరిస్తున్న స్వామివారికి స్థానికులు కర్పూర నీరాజనాలు సమర్పించారు.

ఆర్‌డీఎం గేటు వద్ద ఆక్రమణల తొలగింపు



పుత్తూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్‌డీఎం రైల్వే గేటుకు ఉత్తరంగా రైల్వే స్థలంలో ఉన్న దాదాపు యాభై దుకాణాలను రైల్వే అధికారులు తొలగించారు. ఈ గేటు వద్ద రైల్వే లైను కాస్త వంపు తిరిగి ఉంటుంది. దీని కారణంగా స్నిగ్నల్‌తో పాటు గేట్‌మేన్ ఇచ్చే జెండా సిగ్నల్ కూడా కనపడడం లేదని ఉన్నతాధికారులకు డ్రైవర్లు పలుమార్లు ఫిర్యాదులు చేశారు. దీంతో మంగళవారం ఆక్రమణలను రైల్వే అధికారులు తొలగించారు.

టెన్త్ విద్యార్థులకు మాక్ టెస్టులు

పుత్తూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రతిభను వెలికి తీయడంలో ఏఐఎస్ఎఫ్ ముందుంటుందని ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్ అన్నారు. టెన్త్ విద్యార్థులకు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఓ ప్రైవేటు విద్యాసంస్థలో మాక్ టెస్టులను నిర్వహించారు.

విద్యార్థుల పోరుబాట పోస్టర్ల ఆవిష్కరణ

పుత్తూరు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 12న బుధవారం విద్యార్థుల పోరుబాటను చేపడుతున్నామని ఆ పార్టీ నాయకుడు కుమారస్వామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పోరుబాట వాల్‌పోస్టర్లను మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు లోకనాథం, మున్సిపల్ ఛైర్మన్ హరి, వైస్‌ఛైర్మన్లు శంకర్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

టీడీపీ సీనియర్ నేత మృతి



మునికృష్ణయ్య (ఫైల్‌ఫొటో)

డక్కిలి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం చాకలపల్లి గ్రామానికి చెందిన టీడీపీ పార్టీ సీనియర్ నాయకుడు మునికృష్ణయ్య(62) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. ఆయన మృతదేహానికి మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, పులి జనార్దనరెడ్డి, వేముల నాగభూషణం నాయుడు, గడ్డం సుధీర్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ విజయవాడ నుంచి ఫోన్‌లో మునికృష్ణయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తవ్వి... వదిలేశారు!

- వారం రోజులుగా మంచినీళ్లు లేవు
- క్యాన్ వాటర్ తెచ్చుకునేందుకు దారీ లేదు



పైప్‌లైన్ మరమ్మతుల కోసం తవ్వి వీధిలో పోసిన మట్టి

వెంకటగిరి టౌన్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని తోలిమిట్ట అంకమ్మ చెట్టు వీధిలో ఏడాదిగా మంచినీళ్లు రావడంలేదని మున్సిపాలిటీ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీ సిబ్బంది రెండుసార్లు నామమాత్రంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకున్నారు. ఇటీవల నీటి సరఫరా పూర్తిగా ఆగిపోయింది. దీంతో వీధిలో చాలా దూరం తవ్వి పైపును బయటకు తీశారు. కానీ మరమ్మతులు చేయకుండా వారం రోజులుగా కాలయాపన చేస్తున్నారు. ఇలా తవ్వి పోసిన మట్టి వీధి మొత్తం నిండిపోవడంతో ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లడానికి వీలులేకుండా పోయింది. ఇళ్ల ముందు గాడి తవ్వడంతో ఇంట్లో నుంచి బయటకు రావాలన్నా ఇబ్బందులు తప్పడంలేదని స్థానికులు వాపోతున్నారు. వృద్ధులు, పిల్లలు కాలువ దాటి వెళ్లడానికి అవస్థలు పడుతున్నారు. వారం రోజులుగా మంచి నీళ్లు రావడం లేదని, బయటకు వెళ్లి క్యాన్ వాటర్ తెచ్చుకుందామన్నా దారి సరిగా లేక ఇబ్బందులు పడుతున్నామని, అధికారులు వెంటనే సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

షార్‌లో ముగిసిన జాతీయ భద్రతా వారోత్సవాలు



ఐఓసీఎల్ డైరెక్టర్ సెంధిల్‌కుమార్‌కు రాకెట్ జ్ఞాపికను అందజేస్తున్న షార్ డైరెక్టర్ రాజారాజన్, కంట్రోలర్ శ్రీనివాసులు రెడ్డి, అధికారులు

సూళ్లూరుపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో జాతీయ భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో జరిగిన కార్యక్రమంలో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ మాట్లాడుతూ జీవిత ప్రయాణంలో ప్రతి ఒక్కరికి భద్రత ఎంతో అవసరమన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఐఓసీఎల్ డైరెక్టర్ సెంధిల్ కుమార్ కార్యాలయ పరిసరాల్లో భద్రత, గ్యాస్ పైప్‌లైన్లలో భద్రత గురించి ఉద్యోగులు, విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. ఉద్యోగులు, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో షార్ కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, సీజీఎం పి.వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

గూడూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు స్థానిక జడ్పీబాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు భారతి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మాండ్లెస్ కంపెనీ సహకారంతో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా వెంకటాచలంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో అండర్-14 విభాగంలో జాషువా, అండర్-17 విభాగంలో లోకేష్ ప్రతిభ చూపి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 20, 21 తేదీల్లో హిమాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి శుభ్ ఆరంభ్ ట్రోఫీ టోర్నమెంట్‌లో వీరు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయమ ఉపాధ్యాయుడు శివకుమార్, హరికృష్ణ తదిత రులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం భారతి

వివాదాస్పద భూముల పరిశీలన



అష్టకావేరి గ్రామంలో వివాదాస్పద భూమిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

బాలయపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అష్టకావేరి గ్రామంలో పల్లిపాటి రమణయ్య, వున్నం మస్తాన్ నాయుడు మధ్య వివాదాస్పదంగా ఉన్న భూమిని మంగళవారం గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా పరిశీలించారు. భూమికి సంబంధించిన వివరాలను ఇరువర్గాల నుంచి సేకరించారు. సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట తహసీల్దారుతో పాటు రెవెన్యూ అధికారులు ఉన్నారు.

చెంగాళమ్మ ఆలయంలో నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

సూళ్లూరుపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి మంగళవారం గూడూరుకు చెందిన విజయకుమార్, వసుంధర దంపతులు రూ.1,00,116 అందజేశారు. ముందుగా అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆలయ సిబ్బందికి చెక్కు అందజేశారు.

ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

గూడూరు అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్‌కు చెందిన హరిబాబు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. మంగళవారం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబ సభ్యులకు రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్ట్ సభ్యుడు బాబు పాల్గొన్నారు.

దళిత స్త్రీ వేదనను చిత్రించిన కవిత్వం
డాక్టర్ భీమన్న

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సమాజం ఎంతో అభివృద్ధి సాధించినప్పటికీ దళిత మహిళ నేటికీ వివక్షను అనుభవిస్తూ ఉందని ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ తెలుగు అధ్యాపకులు డాక్టర్ భీమన్న తెలిపారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగంలో మంగళవారం నిర్వహించిన కటాక్షమ్మ పాల్‌రాజ్ ధర్మనిధి ఉపన్యాసంలో భాగంగా 'దళిత కవిత్వంలో స్త్రీ' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. సాహిత్యరంగంలో సామాన్యుల జీవితాన్ని ప్రతిబింబించేలా బసవేశ్వరుడి నుంచీ వేమన, వీరబ్రహ్మం వంటి సంస్కర్తలు కృషి చేశారన్నారు. గద్దర్, కలేకూరి ప్రసాద్ వంటి వారు దళిత స్త్రీ జీవిత వేదనను కవిత్వంగా మలిచారని తెలిపారు. తద్వారా దళిత స్త్రీ జీవిత మార్పునకు ప్రయత్నించారన్నారు. కార్యక్రమంలో డీన్ విజయలక్ష్మి, తెలుగు విభాగాధిపతి కొలకలూరి మధుజ్యోతి, అధ్యాపకులు వై.సుభాషిణి, డి.యువశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.



భీమన్నను సన్మానిస్తున్న తెలుగు అధ్యాపకులు

సకాలంలో పన్నులు చెల్లించండి

గూడూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు సకాలంలో ఆస్తి, కొళాయి పన్నులను చెల్లించి మున్సిపాలిటి అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు పన్నులను సకాలంలో చెల్లిస్తే అభివృద్ధి పనులను చేపట్టవచ్చన్నారు. అదేవిధంగా చెత్తను రోడ్లపై వేయకుండా పారిశుధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఇక పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని ఆపేయాలని, ఎవరైనా ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తే కఠిన చర్యలు చేపడుతామన్నారు.

సంగమేశ్వరుడి హుండీ లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు

కోట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గూడలిలో వెలసిన కామాక్షీదేవి సమేత సంగమేశ్వరస్వామి హుండీని మంగళవారం దేవదాయశాఖ అధికారులు లెక్కించారు. ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఈవో శశ్యాంక్, ఆలయ ప్రధానార్చకుడు కార్తీక్‌స్వామి సమక్షంలో స్వామివారి హుండీని లెక్కించగా రూ.63,548 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పల్లెమల్లు వెంకటకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ వీరరాఘవరెడ్డి పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

తడ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వాటంబేడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సూళ్లూరుపేట రోటరీక్లబ్ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి అందజేశారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో రోటరీక్లబ్ మాజీ అసిస్టెంట్ గవర్నర్ వేనాటి విజయలక్ష్మి చేతుల మీదుగా విద్యాసామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో మల్లికార్జునరావు, రోటరీక్లబ్ కార్యదర్శి రామకృష్ణ, సభ్యులు చక్రవర్తి, ప్రధానోపాధ్యాయులు కుసుమకుమారి, ఉస్మాన్ భాషా పాల్గొన్నారు.

వీధికుక్క దాడిలో బాలికకు గాయాలు



గాయపడిన చాందిని

చిట్టమూరు, మార్చి 11 మండల పరిధిలోని దరఖాస్తు గ్రామంలో మంగళ వారం వీధికుక్క దాడి చేయడంతో నాలుగేళ్ల చిన్నారికి తీవ్ర గాయా లయ్యాయి. చిన్నారి చాందిని ఇంటి ముందు వీధిలో ఆడుకుంటుండగా వీధికుక్క దాడిచేసి గాయ పరిచింది. తల్లిదండ్రులు గమనించి వెంటనే గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఎన్నికల ప్రక్రియలో అపరిష్కృత అంశాలపై ఫిర్యాదు చేయండి
రాజకీయ పార్టీల నేతలకు ఎన్నికల కమిషన్ సూచన

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 11(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక, ఉప ఎన్నికల్లో అపరిష్కృతంగా ఉన్న అంశాలపై రాజకీయ పార్టీ నాయకులు ఏప్రిల్ 30వ తేదీ లోపు ఫిర్యాదుచేయవచ్చని భారత ఎన్నికల సంఘం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఎన్నికల ప్రక్రియ నిర్వహణను బలోపేతం చేసి పారదర్శకంగా నిర్వహించేందుకు అపరిష్కృతంగా ఉన్న పలు అంశాలను గుర్తింపు పొందిన రాష్ట్ర, జాతీయ పార్టీ ప్రతినిధులకు సూచించారు. ఈఆర్వో, జిల్లా ఎన్నికల అధికారి వద్ద ఫిర్యాదు చేసినా పరిష్కారం కాని అంశాలపై ఏప్రిల్ 30లోపు ఫిర్యాదుచేయాలని ఎన్నికల సంఘం సూచించింది.

నేటి నుంచి వర్క్‌షాప్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 11(ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర వేద వర్సిటీలో బుధవారం నుంచి 21 రోజుల పాటు ఆగమ సిద్ధాంతంపై అంతర్జాతీయ వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ప్రారంభ సభ బుధవారం ఉదయం 10 గంటలకు పరిపాలనా భవనంలో నిర్వహిస్తారు. ఇందులో వీసీ రాణీసదాశివమూర్తి, శ్రీవారి ఆలయ ప్రధానార్చకులు అర్చకం వేణుగోపాల దీక్షితులు, ప్రముఖ వైఖానస ఆగమ పండితులు వేదాంతం సత్యశ్రీనివాస అయ్యంగార్ పాల్గొంటారని ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ రాజేష్‌కుమార్ తెలిపారు.

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



కంపెనీలకు వెళ్లే యువతులతో మాట్లాడుతున్న సీఐ మురళీకృష్ణ

సూళ్లూరుపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అపరిచితుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ మురళీకృష్ణ అన్నారు. మంగళవారం తెల్లవారుజామున సూళ్లూరుపేట పట్టణంలోని పలు ప్రధాన కూడలి ప్రాంతాల్లో పోలీసుల తనిఖీలు చేపట్టారు. గోళ్లమిట్ట, షార్ బైపాస్ కూడలి వై జంక్షన్ వద్ద పరిశ్రమలకు వెళ్తున్న యువతుల వివరాలడిగి తెలుసుకొన్నారు. విధులకు వెళ్లేటప్పుడు, తిరిగి వచ్చే సమయంలో అపరిచితుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఒంటరిగా వెళ్లే వారిని చైన్ స్నాచర్లు టార్గెట్ చేస్తున్నారని తెలిపారు. రాత్రి, తెల్లజాము సమయాల్లో కొత్త వ్యక్తులు వెంబడించినా, అనుమానాస్పదంగా సంచరిస్తున్నా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కంపెనీల్లో విధులకు వెళ్లే యువతులు రాత్రి సమయాల్లో జనసంచారం ఉన్నచోటే బస్సులు దిగి ఇళ్లకు వెళ్లాలన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రాంగణ ఎంపికల అధికారి, కంపెనీ ప్రతినిధులు

కోట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం బీటెక్ ఆఖరి సంవత్సరం చదువుతున్న మెకానికల్, ఎలక్ట్రికల్ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు జరిగాయి. గుజరాత్‌కు చెందిన ఆటాహి మోడీ మెటీరియల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఇంటర్వ్యూలు నిర్వహించింది. వర్చువల్ రౌండ్‌కు 37మంది విద్యార్థులు హాజరుకాగా 10 మంది టెక్నికల్ రౌండ్‌కు ఎంపికయ్యారు. చివరగా హెచ్‌ఆర్ రౌండ్‌లో నలుగురు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఆయా విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ప్రాంగణ ఎంపికల అధికారి డాక్టర్ కిషందర్ అభినందించారు.

వేనాడులో వైద్యశిబిరం



ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి జయశ్రీదేవి, సిబ్బంది

సూళ్లూరుపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వేనాడు గ్రామంలో రామాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి జయశ్రీదేవి ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. వేనాడు దళితవాడవాసులు రెండు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి స్థానికులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజకుమారి, వైద్య సిబ్బంది శివరంజని, సుశీల, సరస్సు, కల్యాణి, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

తీరప్రాంత గ్రామాల అభివృద్ధికి నిధులివ్వండి



నిర్మలా సీతారామన్‌తో మాట్లాడుతున్న కొమారి కోటేశ్వరరావు

కోట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గంలోని చిల్లకూరు మండలం మొదలుకొని సూళ్లూరుపేట నియోజకవర్గంలోని తడ మండలం వరకు సముద్రం వెంబడి ఉన్న తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కొమారి కోటేశ్వరరావు కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఢిల్లీలోని మంత్రిని ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా నాలుగు మండలాలకు కూడలిగా ఉన్న కోట సామాజిక ఆరోగ్య కేంద్రం సామర్థ్యాన్ని 50 పడకలకు పెంచి అభివృద్ధి చేయాలని కోరారు.

ఏసీసీఎల్ లీగ్‌లో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం జట్టు సత్తా

తిరుపతి(క్రీడలు), మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ క్రికెట్ స్టేడియంలో మంగళవారం జరిగిన మెగా కార్పొరేటర్ క్రికెట్‌లీగ్‌లో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం(ఎన్ఎస్‌యూ), ఎస్పీడీసీఎల్ జట్లు తలపడ్డాయి. ఆద్యంతం ఉత్కంఠంగా సాగినా చివరికి ఎన్ఎస్‌యూ జట్టునే విజయం వరించింది. తొలుత ఎస్పీడీసీఎల్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 177 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన ఎన్ఎస్‌యూ జట్టు అనూహ్యంగా విజయాన్ని అందుకుంది. కెప్టెన్ ఊకా సేతురామ్ చివరి ఓవర్లో అసాధారణ ఆటతీరును కనబరచి జట్టుకు విజయం చేకూర్చాడు. దీంతో సహచరులు, ప్రేక్షకులు అభినందించారు.



విజేతగా ఎన్ఎస్‌యూ జట్టు

15న జాబ్‌మేళా

శ్రీకాళహస్తి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళా శాలలో ఈనెల 15వ తేదీ శనివారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం, కళాశాల ప్రిన్సిపాల్ నాగ రాజునాయుడు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీ, సీడాప్, డీఆర్‌డీఏ, జేకేసీ సంయుక్త ఆధ్వర్యంలో ఉద యం 9 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహి స్తున్నట్లు తెలిపారు. పలు బహుళ జాతీయ కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టెన్త్, ఇంటర్మీ డియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులైన యువతీ యువకులు అర్హులన్నారు. ఆధార్‌కార్డు, విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్సు కాపీలు, బయోడేటాతో పాటు సంబంధిత రిజిస్ట్రేషన్ లింక్‌లో నమోదు చేసుకున్న అడ్మిట్‌కార్డుతో హాజరు కావాల న్నారు. వివరాలకు నెం.7989509540, 8919889609లలో సంప్రదించాలన్నారు.

వైభవంగా ప్రదోష పూజలు


ప్రదోష నందికి చందనాభిషేకం - స్వామిఅమ్మవార్ల ప్రాకారోత్సవం

నాగలాపురం, మార్చి 11, (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో మంగళవారం ప్రదోష పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలోని పరివార దేవతలకు ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుకుల్ అభిషేకాలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలోని నందీశ్వరుడికి అభిషేకాలు చేసి దీప, ధూప నైవేద్యాలు సమర్పించారు. తదనంతరం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి మంగళ వాయిద్యాల నడుమ నక్షత్ర, కుంభ, మహా హారతులు చేపట్టారు. హారతి అనంతరం మరగదాంబిక సమేత వాల్మీకేశ్వరస్వామి ఉత్సవమూర్తులను దివ్యాంగ సుందరంగా అలంకరించి ఆలయ ఆవరణలో ప్రాకారోత్సవం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ ఈవో లత ఆధ్వర్యంలో సిబ్బంది పర్యవేక్షించారు.

వేంబాక్కం ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేటు


నాగలాపురంలో జరిగిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక

నాగలాపురం, మార్చి 11, (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం తిరుపతి జిల్లా డ్వామా పథక సంచాలకుడు శ్రీనివాస ప్రసాద్ ఆధ్వర్యంలో 17వ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై, గత నెలలో 12వ తేదీ నుంచి 28 వరకు సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీకి సంబంధించి ఉపాధిహామీ, పంచా యతీ రాజ్, గృహ నిర్మాణ శాఖ, సర్వశిక్షా అభియాన్, పశు సంవర్ధక శాఖలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో భాగంగా మండలంలోని వేంబాక్కం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణపై పలు అభియోగాలు సభ దృష్టికి వచ్చింది. అభియోగాలు నిర్ధరణతో పాటు రూ.76 వేలు దుర్వినియోగానికి పాల్పడినట్లు తేలింది. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్‌ని విధుల నుంచి తొలగిస్తూ, నగదు రికవరీకి ఆదేశించడమే కాకుండా రూ.5వేలను జరిమానా వేశారు. పంచాయతీరాజ్ శాఖలో కాంట్రాక్టర్‌కు బదులుగా ఈఈ ఖాతాకు బదిలీ అయిన రూ.7.42 లక్షలను రికవరీ చేయాల్సిందిగా ఆదేశించారు. వేంబాక్కంలో తప్పుడు నివేదిక ఇచ్చిన ఉపాధి ఏపీడీ, ఏపీవోలను సస్పెండ్ చేయాలంటూ గ్రామస్తులు పీడీని కోరారు. కాగా ఈ కార్యక్రమానికి పదిహేను మంది సర్పంచులతో పాటూ పూర్తిస్థాయిలో ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీవీవో శివయ్య, ఏపీడీ సరిత, ఎంపీడీవో వెంకటరత్నమ్మ, ఏపీవో సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా భేరివారి మండపం కూడలి


కాలువలో పడ్డ దివ్యాంగ వృద్ధుడికి సాయం చేస్తున్న స్థానికులు

శ్రీకాళహస్తి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భేరివారి మండపం కూడలి ప్రమాదా లకు నిలయంగా మారింది. మండపం దక్షిణం వైపున జయరామరావువీధికి వెళ్లే కూడలిలో మురుగుకాలువ ప్రమాదకరంగా మారింది. ఈ కూడలిలో భేరివారి మండపం పక్కనే రోడ్డుకు రెండు వైపులా మురుగు కాలువలపై గతంలో మూతలు లేకపోవడంతో నిత్యం వాహనదారులు, పాదాచారులు అదుపు తప్పి గాయపడేవారు. రెండేళ్ల క్రితం దీనిపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో పలుమార్లు కథనాలు ప్రచురితం కావడంతో అప్పటి పురపాలకసంఘ అధికారులు స్పందించారు. కాలువపై ఇనుప కమ్మీలను రక్షణగా ఏర్పాటు చేశారు. ఇటీవల ఆరునెలల క్రితం వినాయకస్వామి గుడికి ఆనుకుని ఉన్న కాలువపై ఇనుప కమ్మీల భాగం తొలగిపోయింది. అప్పటి నుంచి మళ్లీ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి మంగళవారం ఓ దివ్యాంగుడు అక్కడ అదుపు తప్పి కాలువలో పడిపోవడంతో తలకు గాయమైంది. వెంటనే స్థానికులు స్పందించి హుటాహుటినా అతనిని పైకి లాగి చికిత్సలు అందించారు. ఇది నాలుగు రోడ్ల కూడలి పైగా మలుపు ప్రాంతం కావడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తలుపులకు
నిప్పంటించిన గుర్తు తెలియని వ్యక్తులు



పిచ్చాటూరు, మార్చి 11(ఆంధ్ర జ్యోతి): మండలంలోని కారూరు అంగన్‌వాడీ కేంద్రం తలుపునకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. ఈ ఘటన సోమవారం రాత్రి జరిగింది. స్థానికుల సమాచారం మేరకు... కారూరు ఎస్సీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం తలుపులకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించినట్లు తెలిపారు. అలాగే ఈ అంగన్‌వాడీ కేంద్రం చీకటి పడితే అనేక రకాలైన అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోందని స్థానికులు వాపోతున్నారు. మద్యం మత్తులో మందుబాబులు నిప్పంటి ఉంటారని భావిస్తున్నారు. పోలీసులు రాత్రి వేళల్లో గస్తీ నిర్వహించాలని, తద్వారా చోరీలు, నేరాల శాతం తగ్గుముఖం పడుతాయని స్థానికులు కోరుతున్నారు.

అంతర పంటగా ఔషధ మొక్కలు


గుత్తివారిపల్లెలో పంట పరిశీలనలో అధికారులు, రైతులు

రేణిగుంట, మార్చి 11, (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలో స్వల్ప కాలిక ఔషధ మొక్కలను అంతర పంటగా సాగు చేయడం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని కేరళ ఫారెస్ట్ రీసెర్చి సెంటర్, జాతీయ ఔషధ మొక్కల బోర్డు రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కేసీ చౌకో తెలిపారు. మంగళవారం మండలంలోని రాస్ కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం గుత్తివారిపల్లి రాస్ కేంద్రంలో ఔషధ మొక్కలు సాగు, మార్కెటింగ్‌పై రైతులకు అవగాహన కల్పించారు. స్వల్ప కాలిక పంటలైన అశ్వ గంధ, సర్పగంధ, బావంచాలు తదితరాలను సాగు చేయవచ్చన్నారు. రీజనల్ ఫస్ట్ లెసన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్, కె.వి.కె. హెడ్ డాక్టర్ శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు పద్మజ, దివ్య, సుధా, ఎస్ఆర్ఎస్‌లు చిరంజీవి, అఖిల్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి వితరణ

శ్రీకాళహస్తి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన పిళ్లారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో 162మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 145మంది, ఊరందూరులోని ఉన్నత పాఠశాలలో 40మంది, ముచ్చివోలు ఉన్నత పాఠశాలలో 41మంది విద్యార్థులకు పరీక్షా సామగ్రిని అందజేశారు.

విజ్ఞానగిరి వినాయక సన్నిధి మూత

ముక్కంటి అధికారుల తీరుపై భక్తుల ఆవేదన


విజ్ఞానగిరి వద్ద వినాయకసన్నిధికి తాళం వేసిన దృశ్యం

శ్రీకాళహస్తి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న విజ్ఞానగిరి వినాయక సన్నిధికి మూత వేయడంపై భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ నడిబొడ్డున విజ్ఞానగిరి కొండ ఉన్న విషయం తెలిసిందే. కొండపై సుబ్రహ్మణ్యం స్వామి కొలువై ఉన్నాడు. కొండ కింద వినాయక సన్నిధి ఉంది. మొదట వినాయకస్వామి దర్శించుకుని మెట్లద్వారా విజ్ఞానగిరికు చేరుకోవడం ఆనవాయితీ. విజ్ఞానగిరికి చాలా ప్రాశస్త్యం ఉంది. ముక్కంటి ఆలయం నుంచి ఉత్సవమూర్తులుగా ఊరేగే పార్వతీ పరమేశ్వరులు సైతం మొదట విజ్ఞానగిరి వినాయక సన్నిధికి చేరుకుని తిరిగి ఆలయానికి చేరుకుంటారు. యేటా మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా జరిగే స్వామిఅమ్మవార్ల ఊరేగింపు కూడా విజ్ఞానగిరి వినాయక సన్నిధి వరకు చేర్చి హారతులు సమర్పిస్తారు. ప్రతి మంగళవారం విజ్ఞానగిరిపై కొలువై కుమారస్వామికి ముక్కంటి ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ అభిషేక క్రతువులు, విశేష పూజలు నిర్వహిస్తారు. ఈ సమయంలో పెద్దఎత్తున విజ్ఞానగిరిని దర్శించుకునేందుకు భక్తులు విచ్చేస్తుంటారు. అయితే గత కొద్దిరోజులుగా కొండ వద్ద తొలి దర్శనం చేసుకునే వినాయకసన్నిధి తాళం వేసి ఉన్నట్లుగానే కొనసాగుతోంది. మంగళవారం అభిషేకం జరిగే కీలక సమయంలో కూడా అలాగే వినాయక సన్నిధికి తాళం వేసి ఉండటంతో భక్తులు అధికారుల తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై వినాయక సన్నిధిలో నిత్య ధూప దీపారాధనలు జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి

నాలుగు గ్రామాల ప్రజల నిరసన


ఆర్‌అనంతపురం వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీకాళహస్తి- తడ రోడ్డు నుంచి జంబుగోళం గ్రామానికి వెళ్లే గుంతల రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని నాలుగు గ్రామాల ప్రజలు ఆర్‌అనంతపురం రోడ్డుపై మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జంబుగోళం గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారిందన్నారు. ఆర్.అనంతపురం, బీఎన్‌కండ్రిగ, పూసలపల్లి, చిన్నయ్యగుంట, తహనగర్ గ్రామాలే కాకుండా సూళ్ళూరుపేట మండలానికి పది గ్రామాల ప్రజలు ఈ రోడ్డులో ప్రయాణిస్తుంటారని తెలిపారు. గత ఐదు సంవత్సరాలుగా ఈ రోడ్డు నిర్వహణను పట్టించుకోకపోవడంతో అడుగడుగునా గుంతలతో ప్రయాణం దుర్భరంగా మారిందన్నారు. ఆర్టీసీ బస్సులు సైతం ఈ మార్గంలో నిలిపివేశారని తెలిపారు. ఆటోలు సైతం అతి కష్టంగా ప్రయాణిస్తున్నాయని తెలిపారు. ద్విచక్ర వాహనాలు ఈ మార్గంలో ప్రయాణించి అనేక మంది గాయపడిన ఘటనలు ఉన్నాయన్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గత ఐదు సంవత్సరాలుగా అధికారు లకు, ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పది రోజుల్లో రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోతే కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. వీరికి మద్దతుగా సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య పాల్గొన్నారు. కృష్ణమూర్తి, శేషాద్రి, గుర్రమ్మ, లక్ష్మి, వెంకటేష్, సుబ్రహ్మణ్యం, కృష్ణ, సుధాకర్, మల్లి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి


చల్లాఆదినారాయణ (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో రైతు మృతి చెందాడు. శ్రీకాళహస్తి మండలం రావులింగాపురానికి చెందిన చల్లా ఆదినారాయణ(60) రైతు. ఆయన ట్రాక్టరుకు మరమ్మతులు అవసరం కావడంతో డ్రైవర్‌ను వెంటబెట్టుకుని సోమవారం ఏర్పేడుకు వెళ్లాడు. అక్కడ పని ముగించుకున్న అనంతరం ట్రాక్టరులో వెనుక కూర్చున్నాడు. మార్గమధ్యంలో శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి వద్ద పీఎన్ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆదినారాయణను చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి మంగళవారం ఏరియా ఆస్పత్రి మార్చురీలో పోస్టుమార్టం పూర్తి చేసిన అనంతరం బంధువులకు అప్పగించారు.

పాముకాటుతో వృద్ధురాలి ....


సావిత్రమ్మ (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో వృద్ధురాలు మృతి చెందింది. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీకాళహస్తి మండలం రాచ గున్నేరికి చెందిన సీతారాం వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఆయన తల్లి సావిత్రమ్మ(76) వినికిడి లోపంతో పాటు మాట్లాడలేదు. సోమవారం రాత్రి ఇంటి ఆవరణలో బహిర్భూమికి వెళ్లింది. కాసేపటి తరువాత ఆమె నోటి నుంచి నురగ రావడాన్ని గమనించిన కుమారుడు పాముకాటుకు గురైనట్లు గుర్తించాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించే లోపు ఆమె మృతి చెందింది. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కాశీ విశ్వేశ్వరుడికి ప్రత్యేక పూజలు



శ్రీకాళహస్తి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కొలువై ఉన్న కాశీ విశ్వేశ్వర స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. త్రయోదశిని పురస్కరించుకుని ముందుగా స్వామివారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా శంభాజీ మహారాజ్ బలిదాన్ దివస్


శంభాజీకి నివాళులర్పిస్తున్న హిందు సంస్థలు, బీజేపీ నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్ఆర్ పిక్చర్ ప్యాలెస్ వద్ద మంగళవారం ఛత్రపతి శంభాజీ మహారాజ్ బలిదాన్ దివస్ జరిగింది. ఆయన జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన చావా చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ శ్రీకాళహస్తి సంయోజక్ శశాంక్ మాట్లాడుతూ... శంభాజీ మహారాజ్ త్యాగాలను ప్రజలు గుర్తు పెట్టుకుని దేశభక్తులుగా మారాలని పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రప్ప, భజరంగ్‌దళ్ కార్యకర్త శాండిల్య, వీహెచ్‌పీ కార్యకర్తలు సుబ్రహ్మణ్యం, సతీష్, కిషోర్, సురేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంప్ స్వాధీనం



సత్యవేడు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లప్పగుంట బీడు భూముల్లో అక్రమ రవాణా కోసం నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను సీఐ మురళి స్వాధీనం చేసుకున్నారు. సత్యవేడు, నాగలాపురం మండలాల సరిహద్దులో గత కొంతకాలంగా ఇసుకను అక్రమంగా నిల్వ ఉంచి రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సీఐ ఆధ్వర్యంలో సత్యవేడు ఎస్ఐ రామస్వామి, సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడులలో అల్లప్పగుంట పంట పొలాల్లో నిల్వ ఉంచిన 15 యూనిట్ల ఇసుకను గుర్తించి, సీజ్ చేశారు. ఇసుక నిల్వ చేసిన ప్రాంతం నాగలాపురం సరిహద్దులో ఉండడంతో అక్కడి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు సీఐ మురళి తెలిపారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

కేవీబీపురం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలో కొంతమంది ఇష్టానుసారంగా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నారు.. అలాంటి వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని తహసీల్దారు మునిరత్నంరెడ్డి హెచ్చరించారు. ముఖ్యంగా ప్రభుత్వ ప్రయోజనాల కోసం గతంలో కాలనీలోని రోడ్లు, భూములను రికార్డు పరంగా వదిలివేసి అనాధీనంగా ఉన్నాయి. కొంతమంది వాటిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ-క్రాప్ నమోదుపై గ్రామసభ

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుక్కంబాకం సచివాలయం వద్ద ఈక్రాప్ నమోదుపై సామాజిక తనిఖీ గ్రామసభను మండల వ్యవసాయాధికారి భారతి నిర్వహించారు. మండలంలో రబీలో 2024-25 సీజన్‌కు సంబంధించి 28 పంచాయతీల్లో 3,504మంది రైతులు 9,149ఎకరాల్లో ఈ-క్రాప్ పూర్తైందన్నారు. మండలంలోని 14 రైతు సేవా కేంద్రాల్లో ఈ-క్రాప్ నమోదుపై సామాజిక తనిఖీ గ్రామసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతు సేవా కేంద్రాల వద్ద ఈ-క్రాప్ ముసాయిదా జాబితాను ప్రదర్శించి అన్ని వివరాలను రైతులకు తెలిజేస్తామన్నారు.

ఓరుగంటి చారిటీస్ నూతన కార్యవర్గం



శ్రీకాళహస్తి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓరుగంటి చెంగయ్య శెట్టి సత్రంలో ఓరుగంటి రామలింగయ్యశెట్టి, మంగమ్మ చారిటీస్ నూతన కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముందుగా వాసవి మాతకు పూజలు నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా కోటిలింగాల దయాగుప్తా, చైర్మన్‌గా కోటిలింగాల శశిధర్, సభ్యులుగా బాలాజీకృష్ణ, ఎంజే స్వరూప్ ప్రమాణస్వీకారం చేశారు. ట్రస్టు అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

రెండు కార్ల స్వాధీనం

●ఇద్దరు నిందితుల అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బాడుగకు తీసుకుని అమ్మేసిన రెండు కార్లను స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ తిమ్మయ్య, ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో రికవరీ చేసిన కార్లను, అరెస్టు చేసిన ఇద్దరు నిందితులను మంగళవారం విలేకరుల సమావేశంలో చూపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఆర్‌అనంతపురానికి చెందిన మహేష్.. తిమ్మాభూపాలపురానికి చెందిన ఉమాశంకర్‌కు రెండు కార్లను నెల బాడుగకు ఇచ్చాడు. అయితే ఉమాశంకర్ తన అనుచరులు దశరథన్, జాఫర్‌బాషాతో కలసి రికార్డులను తారుమారు చేసి పాకాలకు చెందిన వారికి అమ్మేశారు. బాడుగ ఇవ్వకపోగా కార్లును అమ్మేశాడంటూ పోలీసుస్టేషన్‌లో మహేష్ ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ తిమ్మయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కార్లు పాకాలలో ఉన్నట్లు సమాచారం అందడంతో వాటిని స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చారు. ఉమాశంకర్ పరారీలో ఉండటంతో దశరథన్, జాఫర్ బాషాను అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మూడు వాహనాలకు జరిమానా


వాహనదారులకు సూచనలు ఇస్తున్న పోలీసులు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రికార్డులు సక్రమంగా లేకుండా నడుపుతున్న మూడు వాహనాలకు శ్రీకాళహస్తి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ దామోదర్‌నాయుడు రూ.65వేలు జరిమానా విధించారు. మంగళవారం బీఎన్‌కండ్రిగ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్ఐ విశ్వనాథం నాయుడితో కలిసి వాహన తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పలు వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. చోదకులు తప్పకుండా రికార్డులను తమ వాహనంలో ఉంచుకో వాలని చెప్పారు. హెల్మెట్, సీటుబెల్టు కచ్చితంగా ధరించాలన్నారు. ఇకపై సీటు బెల్టు, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే జరిమానా విధిస్తామన్నారు. పలు వాహనాలకు సంబంధించి డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు.